
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 30 డిసెంబరు 2024

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ విజేత ఖమ్మం మహిళా జట్టు



7



- దేశానికి ఉపయోగపడని దేహం, డబ్బు ఎంత పెరిగినా వృథానే..
- రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద
- వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్స్ భవనం ప్రారంభం
- సత్తుపల్లిలో ముగిసిన తెలుగు రాష్ట్రాలస్థాయి 6వ భక్త సమ్మేళనం

## జీవిలోని భగవంతుడికి సేవచేయాలి

6



- రేపటి నుంచి దశావతారాల్లో రామయ్య దర్శనం
- భద్రాద్రికి పోటెత్తుతున్న భక్తులు
- రామయ్యను దర్శించిన పలు దేశాలకు చెందిన ఇస్కాన్ సభ్యులు
- గత ఎనిమిది రోజుల్లో 72,500 మంది దర్శనం.. రూ.కోటి ఐదు లక్షల ఆదాయం

## దక్షిణ అయోధ్యకు అధ్యయనోత్సవ శోభ

6

### రివర్ ఫెస్టివల్ తరహాలో
## ఏర్పాట్లు ఉండాలి

- గోదావరి ఒడ్డున టూరిజం స్పాట్‌గా 'రివర్ క్యాంపింగ్‌టెంట్'
- 40 గిరిజన స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాం
- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



కరకట్ట ప్రాంతంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

భద్రాచలం, డిసెంబరు 29 ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి ఒడ్డు, కరకట్ట ప్రదేశాల్లో రివర్ ఫెస్టివల్ తరహాలో ఏర్పాట్లు ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. భద్రాచలంలో గోదావరి కరకట్ట ప్రాంతంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నందున సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పర్యాటక దర్శనీయ స్థలాలను తీర్చిదిద్దాలన్నారు. వచ్చిన భక్తులు వసతి కోసం అన్ని సౌకర్యాలతో గిరిజనులకు సంబంధించిన పాత కాలపు నివాసాలు ఏర్పాటు చేసి వారికి సంబంధించిన సంప్రదాయ నృత్యాలతో పాటు ఆదివాసీ సంప్రదాయ వంటకాలు, వెదురు కళాఖండాలను టూరిస్టులకు అందుబాటులో ఉండేలా స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టూరిస్టులు సరదాగా సేద తీరి ఫొటోలు దిగడానికి 'రివర్ క్యాంపింగ్‌టెంట్ వద్ద సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయాలన్నారు. బొజ్జిగుప్ప గ్రామంలో పర్యాటక కేంద్రానికి పర్యాటకులు వెళ్లేలా వచ్చే నెల 5నుంచి కరపత్రాలు, బుక్‌లెట్స్ పంపిణీ చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఆర్డీవో దామోదర్‌రావు, మత్స్యశాఖ ఏడీ ఇంతియాజ్ అహ్మద్, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ వెంకటేశ్వరరావు, ఏసీఎంవో రమణయ్య పాల్గొన్నారు.



జాబితాలో తమ పేరు గల్లంతైందని ఆవేదన వ్యక్తం చేస్తున్న చెరుకుపల్లి మౌనిక దంపతులు

కూసుమంచి మండలం మునిగేపల్లి గ్రామానికి చెందిన చెరుకుపల్లి మౌనిక దంపతులకు చిన్న రేకుల ఇల్లు ఉంది. ఇటీవల జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ దరఖాస్తు ఆన్‌లైన్ చేసే సమయంలో జరిగిన పొరపాట్లతో జాబితాలో వీరి దరఖాస్తు గల్లంతైంది. నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన చిలకబత్తిన సరిత, చిలకబత్తిన దివ్య, అదేవిధంగా తిరుమలాయపాలేనికి చెందిన ఉబ్బని నాగమణి, వెంకన్న, కార్తీక్, సంతోష్ పేర్లు గల్లంతయ్యాయి. ఇలాంటి బాధితులు గ్రామాల్లో అనేకమంది ఉన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే గందరగోళంగా సాగుతోంది. ప్రజాపాలన కార్యక్రమంలో సమర్పించిన అనేక దరఖాస్తులు గల్లంతుకావడంతో ఆయా దరఖాస్తుదారులు తమకు ఇళ్లు వస్తాయోరావోనని ఆందోళన చెందుతున్నారు.

# సర్వే సంకటం

## ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో గందరగోళం

- జాబితాలో పలువురి పేర్లు గల్లంతు
- 'ప్రజాపాలన' దరఖాస్తుల ఆన్‌లైన్ సమయంలోనే పొరపాట్లు
- జాబితాలో పేరు లేకుండా వివరాలు తీసుకోలేమంటున్న సర్వే సిబ్బంది
- తమకు ఇళ్లు వస్తాయో లేదోనని బాధితుల ఆందోళన

కూసుమంచి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపట్టాలని ఆదేశించినా క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. సర్వే సందర్భంగా అనేక మంది దరఖాస్తులు గల్లంతవ్వడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా గతంలో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుకు అవకాశం కల్పించింది. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో దరఖాస్తులు సమర్పించారు. అయితే ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతుండగా దరఖాస్తుదారుల జాబితాలో తమపేర్లు లేకపోవడంతో గందరగోళానికి గురవుతున్నారు. ఏంచేయాలో ఎవరిని సంప్రదించాలో తెలియక సతమతమవుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం సిద్ధం అవుతుండటంతో అన్ని అర్హతలు ఉన్నా స్థానికంగా ఉన్న జాబితాలో తమ పేర్లు కనిపించకపోవడంతో అయోమయానికి గురి చేస్తోంది. ఇళ్లు వస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. స్థానిక అధికారులను దరఖాస్తుదారులు సంప్రదిస్తుండగా జాబితాలో మార్పుకు తమకు ఇంకా ఎలాంటి అధికారాలు కల్పించలేదని చెబుతున్నారు.

### ఆన్‌లైన్ నమోదులో తప్పిదాలే శాపం

ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ఆయా మండల కేంద్రాల్లో డిజిటలైజ్ చేశారు. ఇలా డేటా ఎంట్రీ సమయాల్లో అనుకోకుండా జరిగిన తప్పిదాలే గందరగోళానికి కారణంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టార్గెట్‌లు ఇచ్చి ఆన్‌లైన్ చేయించడంతో హడావిడిలో తప్పిదాలు జరిగినట్లు (మిగతా 6వ పేజీలో)

### మంత్రి పొంగులేటికి ఫిర్యాదు

దరఖాస్తుల గల్లంతుపై ఇటీవల ఇందిరమ్మ ఇంటి నమూనాకు భూమి పూజచేసేందుకు వచ్చిన గృహనిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పలువురు దరఖాస్తుదారులు ఫిర్యాదు చేశారు. తాము ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నా జాబితాలో పేర్లు గల్లంతయ్యాయని తెలిపారు. దీనివల్ల తాము ఇంటి మంజూరు కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో మంత్రి స్పందిస్తూ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తిరిగి దరఖాస్తు చేసుకోవాలని చెప్పినా దానికి సంబంధించి ఎలాంటి ఎడిట్ ఆప్షన్ రాలేదని అధికారులు తెలిపారు.

### మార్పులకు
## పెద్దపీట

- జిల్లాకు కొత్త అధికారుల రాక..
- ఎన్నికల కోలాహలంతో నేతల పర్యటనలు
- అన్ని పార్టీల అగ్రనాయకుల రాక
- ఖమ్మాన్ని ముంచెత్తిన మున్నేరు
- ఏడాదిలో ఉమ్మడి జిల్లాకు నాలుగుసార్లు సీఎం రేవంత్‌రెడ్డి
- ఆశావహులకు నామినేటెడ్ పోస్టులతో ఖుషీ
- 2024వ సంవత్సరంలో ఉమ్మడి జిల్లా స్థితిగతులు

2024 కాలచక్రం

ఏడాది కాలంలో జిల్లాలో బోలెడన్ని మార్పులు రికార్డయ్యాయి. ప్రభుత్వం మారడంతో జిల్లాలో ఉన్నతాధికారులు మారారు. ప్రధాన పోస్టుల్లో కొత్త అధికారులు చార్జ్ తీసుకున్నారు. జాతీయ రాజకీయ నాయకులు జిల్లాపై ఫోకస్ పెంచారు. ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాలుగు పర్యాయాలు పర్యటించారు. బడా నేతలతో పాటు విద్యావేత్తలు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుల పర్యటనలు జిల్లాలో సాగాయి. కొత్త ప్రభుత్వంలో కలెక్టర్లు, ఎస్పీలతో పాటు, ఉన్నతాధికారుల మార్పులు జరిగాయి. 6

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం



ప్రథమ బహుమతి సాధించిన వరంగల్ బాలుర జట్టు

### ముగిసిన సీఎం కప్
## వాలీబాల్ పోటీలు

- బాలుర విభాగంలో విజేతగా వరంగల్ జట్టు
- బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు
- తృతీయ స్థానంలో నిలిచిన ఖమ్మం బాల, బాలికల జట్లు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ముగిశాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో వరంగల్ జిల్లా జట్టు ప్రథమ బహుమతి కైవసం చేసుకోగా, బాలికల విభాగంలో నిజామాబాద్ జిల్లా జట్టు ప్రథమ బహుమతిని గెలుకుంది. బాలుర, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జిల్లా జట్లు రన్నరప్‌గా నిలిచాయి. ఇక ఈ పోటీలకు ఆతిథ్యమిచ్చిన ఖమ్మం జిల్లా బాల, బాలికల జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలురు విభాగంలో రంగారెడ్డి జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలవగా, బాలికల విభాగంలో కరీంనగర్ జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. ఇదిలా ఉండగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి సందర్భంగా ప్రస్తుతం ప్రభుత్వం సంతాప దినాలు పాటిస్తుండడంతో పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేయలేదు. సంతాప దినాలు ముగిసిన తరువాత విజేతలకు వారి జిల్లాలకే బహుమతులను పంపిస్తామని ఖమ్మం డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ సెక్రెటరీ గోవిందరెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి, వాలీబాల్ కోచ్ అక్బర్‌అలీ పలువురు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఐసీడీఎస్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నిర్మలజ్యోతి



నిర్మలజ్యోతికి నియామక పత్రాన్ని అందజేస్తున్న టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

కల్లూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళ శిశు సంక్షేమశాఖ గెజిటెడ్ అధికారుల మహిళ విభాగానికి కల్లూరు ప్రాజెక్టుకు చెందిన సీడీపీవో సీహెచ్ నిర్మల జ్యోతి ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన టీఎన్జీవో ఐసీడీఎస్ మహిళ విభాగానికి జరిగిన ఎన్నికల్లో నిర్మలజ్యోతిని ఆ సంఘం తరుపున ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు చేతుల మీదగా నిర్మల జ్యోతికి నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా నిర్మలజ్యోతి మాట్లాడుతూ మహిళ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తానని చెప్పారు. తనకు అప్పగించి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోగల మహిళ ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల జ్యోతికి అభినందనలు తెలిపారు.

## జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాం నారాయణ



రాం నారాయణను సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

కొత్తగూడెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) యూనియన్ పెద్దఎత్తున కృషి చేస్తోందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ తెలిపారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కార్యవర్గసమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతన సంవత్సరంలోని ఫిబ్రవరి నెల 23వ తేదీ ఆదివారం కొత్తగూడెం పట్టణంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీయూడబ్ల్యూజే జిల్లా మూడో మహాసభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభ విజయవంతానికి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇమంది ఉదయ్‌కుమార్, మోబగాపు ఆనంద్‌కుమార్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు దుద్దుకూరి రామారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జునుమాల రమేష్, బీవీ రమణారెడ్డి, కోడూరి సత్యనారాయణతో ఆరుగురు సభ్యుల మానెటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జనవరిలో జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండలాల్లో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తి చేయాలని తెలిపారు. జాతీయ కౌన్సిల్ సభ్యుడు దుద్దుకూరి రామారావు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు.

## ఉపాధ్యాయుల సర్దుబాటు తగదు: టీపీటీఎఫ్

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ ఉద్యోగులు సమ్మెచేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోగా, వారి స్థానంలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి సమ్మెను నిర్వీర్యం చేయటం తగదని టీపీటీఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ విమర్శించింది. ఆదివారం ఇటీవల మరణించిన ఎస్ఎస్ఏ ఉద్యోగి పరిటాల హైమావతి సంతాప సభకు హాజరైన సంఘం నాయకులు మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారిని చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమ్మెకు టీపీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా కమిటీలు సంపూర్ణ మద్దతు తెలిపాయని అన్నారు. రెగ్యులరైజ్, టైమ్‌స్కేల్ హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అన్నారు. మరణించిన ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సహాయంచేసి కుటుంబంలో మరొకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

# తగ్గిన కిక్



రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో మందుబాబులు లేక వెలవెలబోతున్న వైన్‌షాపు

**డిసెంబరులో పడిపోయిన రూ.85 కోట్ల మద్యం విక్రయాలు**

వైరా, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో నూతన మద్యం విధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఆ రాష్ట్ర సరిహద్దుల్లో మద్యం విక్రయాలపై గణనీయమైన ప్రభావం పడింది. కేవలం ఒక్క డిసెంబరులోనే రూ.85 కోట్ల పైచిలుకు మద్యం విక్రయాలు తగ్గిపోయాయి. బెల్టుషాపుల నిర్వహణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నా మద్యం విక్రయాలు తగ్గడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. ఏపీలో బెల్టుషాపులు లేకపోయినప్పటికీ తెలంగాణలో బెల్టుషాపులు ఉన్నా ఇక్కడ మద్యం విక్రయాలు తగ్గిపోయాయి. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని కొన్ని మండలాలు మినహా వైరాలోని ఐఎంఎల్ డిపో నుంచే మద్యం సరఫరా జరుగుతుంది.

**వైన్స్, బార్లు వివరాలు**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 210 వైన్‌షాపులు, 50 బార్లు, మూడు క్లబ్‌లు మొత్తం 263 ఉన్నాయి. కేవలం ఖమ్మంజిల్లాలో 122 వైన్‌షాపులు, 17బార్లు, రెండు క్లబ్‌లు మొత్తం 161కాగా, భద్రాద్రి కొత్తగూడెంలో 88వైన్‌షాపులు, 13బార్లు, ఒక క్లబ్ మొత్తం 102 ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో ఖమ్మం-1 సర్కిల్‌లో 24 వైన్‌షాపులు, 23 బార్లు, ఒక క్లబ్ మొత్తం 48ఉన్నాయి. ఖమ్మం-2 సర్కిల్‌లో 17 వైన్‌షాపులు, ఏడు బార్లు, ఒక క్లబ్ మొత్తం 25 ఉన్నాయి. నేలకొండపల్లి ఎక్సైజ్ సర్కిల్‌లో 15 వైన్‌షాపులు, సింగరేణి సర్కిల్‌లో పది వైన్‌షాపులున్నాయి. మధిర సర్కిల్‌లో 20 వైన్‌షాపులు, మూడు బార్లు మొత్తం 23, వైరా సర్కిల్‌లో 13వైన్‌షాపులు, రెండు బార్లు మొత్తం 15, సత్తుపల్లి సర్కిల్‌లో 23 వైన్‌షాపులు, రెండు బార్లు మొత్తం 25 ఉన్నాయి. కొత్తగూడెం జిల్లా భద్రాచలం సర్కిల్‌లో 16 వైన్‌షాపులు, ఒక క్లబ్, కొత్తగూడెంలో 19 వైన్‌షాపులు, ఏడు బార్లు, పాల్వంచలో 13 వైన్‌షాపులు, నాలుగు బార్లు, ఇల్లెందులో 14 వైన్‌షాపులు, రెండు బార్లు, అశ్వారావుపేటలో 11, మణుగూరులో 15 వైన్‌షాపులున్నాయి.

**తగ్గిన రూ.85కోట్ల మద్యం విక్రయాలు**

గతేడాది డిసెంబరు కంటే ఈ ఏడాది డిసెంబరు 28వతేదీ వరకు రూ.85,38,26,944మద్యం విక్రయాలు తగ్గాయి. గత ఏడాది డిసెంబరులో రూ.263,95,87,360 మద్యం విక్రయాలు జరుగగా ఈ డిసెంబరులో రూ.178,57,60,416 మద్యం విక్రయాలు మాత్రమే జరిగాయి. అంటే రూ.85కోట్ల పైచిలుకు మద్యం విక్రయాలు తగ్గాయి. గత ఏడాది ఐఎంఎల్ పెట్టెలు 3,40,069, బీరుపెట్టెలు 1,58,371 విక్రయించారు. ఈ డిసెంబరులో ఐఎంఎల్ పెట్టెలు 2,37,758, బీరుపెట్టెలు 1,14,783 సరఫరా చేశారు. అంటే గత డిసెంబరు కంటే ఈ డిసెంబరులో ఐఎంఎల్ పెట్టెలు 1,02,311, బీరుపెట్టెలు 43,588 తగ్గాయి.

**సర్కిళ్ల వారీగా తగ్గిన మద్యం విక్రయాలు...**

గతేడాది డిసెంబరులో ఖమ్మం-1, ఖమ్మం-2 సర్కిళ్లలో మద్యం విక్రయాలు ఒకట్రెండు స్థానాల్లో ఉండగా సత్తుపల్లి సర్కిల్ మూడోస్థానం, కొత్తగూడెం సర్కిల్ నాల్గో స్థానం, మధిర సర్కిల్ ఐదో స్థానంలో ఉంది. ఖమ్మం సర్కిళ్లను మినహాయిస్తే ఖమ్మంజిల్లాలోని సత్తుపల్లి, మధిర, వైరా పూర్తిగా ఏపీ సరిహద్దుల్లో ఉన్నాయి. కొత్తగూడెం జిల్లాలో అశ్వారావుపేట, భద్రాచలం సర్కిళ్లు ఏపీ సరిహద్దుల్లో ఉన్నాయి. ఖమ్మం ఒకటో సర్కిల్‌లో ఈ డిసెంబరులో రూ.19.49కోట్ల పైచిలుకు, ఖమ్మం రెండో సర్కిల్‌లో రూ.10.20కోట్ల పైచిలుకు, మధిర సర్కిల్‌లో రూ.10.26కోట్లు, నేలకొండపల్లి సర్కిల్‌లో రూ.6.39కోట్లు, సత్తుపల్లి సర్కిల్‌లో రూ.5.53కోట్లు, సింగరేణి సర్కిల్‌లో రూ.3.60కోట్లు, వైరా సర్కిల్‌లో రూ.5.72కోట్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట సర్కిల్‌లో రూ.4.06కోట్లు, భద్రాచలం సర్కిల్‌లో రూ.3.74కోట్లు, కొత్తగూడెం సర్కిల్‌లో రూ.3.47కోట్లు, మణుగూరు సర్కిల్‌లో రూ.1.81కోట్లు, పాల్వంచ సర్కిల్‌లో రూ.ఐదు కోట్ల పైచిలుకు, ఇల్లెందు సర్కిల్‌లో దాదాపు రూ.ఆరు కోట్ల మద్యం విక్రయాలు తగ్గాయి. ఈ నెల ముగియటానికి రెండురోజుల సమయం ఉన్నందున రూ.పదికోట్ల మద్యం విక్రయాలు జరుగుతాయని అంచనాగా ఉంది. మొత్తంగా గత డిసెంబరు కంటే ఈ డిసెంబరులో మద్యం విక్రయాలు బాగా తగ్గిపోయాయి.

## కాంట్రాక్టు ఒకేషనల్ జూనియర్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషి

- ఎస్‌టీఎఫ్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సైదులు



సైదులుకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఒకేషనల్ లెక్చరర్లకు న్యాయం జరిగేలా అండగా ఉంటామని ఎస్‌టీఎఫ్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు అన్నారు. కాంట్రాక్టు ఒకేషనల్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ, ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం ఖమ్మం నగరంలోని స్కూల్ టీచర్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ సైదులు మాట్లాడుతూ 411 మంది కాంట్రాక్టు ఒకేషనల్ జూనియర్ లెక్చరర్ల రెగ్యులరైజేషన్ ఫైలు గత అసెంబ్లీ ఎన్నికల్లో కోడ్ కారణంగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి వద్ద పెండింగులో ఉందని అన్నారు. వారందిరికీ హెచ్‌ఎస్‌పీతో కూడిన మినిమం టైం హెచ్‌ఆర్‌పీను కల్పిస్తూ ఒక భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి మనసూర్, ఒకేషనల్ కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు నరసింహారాజు, ప్రవీణ్ కుమార్, జంపాల కిరణ్, సింధూ చౌదరి, ఉమామహేశ్వర, రంగారావు, పరశురాం, రఫీ, బి రమేష్, కమలాకర్, డి రవి, జమున, శ్వేత, సమ్రీన్, రామారావు, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మోనోప్లాస్ట్‌తో విద్యుత్ ప్రమాదాలకు చెక్

- తొండలు, బల్లులు, ఉడతల నుంచి రక్షణ చర్యలు



స్తంభాలకు మోనోప్లాస్ట్ ఏర్పాటును పర్యవేక్షణ చేస్తున్న ఎస్ఈ సురేందర్

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): దొండ, బల్లి, ఉడత వంటి చిన్న ప్రాణులు విద్యుత్ తీగలకు, ఫీజు బాక్స్‌లకు తగిలితే ఆ ప్రాంతంలో విద్యుత్ ప్రమాదం జరిగి విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. వేసవిలో వీటి తీవ్రత అధికంగా ఉంటుంది. ఖమ్మం నగరంలోను ఇటువంటి కారణాలతో తరుచూ విద్యుత్ ప్రమాదాలు, అంతరాయాలు ఏర్పడుతున్నాయి. వేసవి విద్యుత్ కార్యాచరణలో భాగంగా ఖమ్మం నగరంలోని విద్యుత్ స్తంభాల లైన్‌లకు కనెక్షన్‌ల వద్ద ప్రత్యేకంగా మోనోప్లాస్ట్ పేస్టులను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో విద్యుత్ స్తంభం నుంచి చిన్న పాటి జంతువులు విద్యుత్ లైన్‌లకు తాకినా వాటికి ప్రాణహాని ఉండదు, విద్యుత్ ప్రమాదాలు, అంతరాయాలు జరగవు. ఖమ్మంలో పైలెట్ ప్రాజెక్టుగా ఆదివారం ఏర్పాటు చేశారు. మోనోప్లాస్ట్ పనిచేసే విధానంపై టీజీఎస్పీడీసీఎల్, ఎస్ఈ సురేందర్ ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సిబ్బందికి సూచనలు చేశారు. డీఈలు రామారావు, బాబురావు, ఏడీఈలు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

## యువత క్రీడల్లో రాణించాలి

- భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాచలం, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): భారత తొలి ప్రధాని నెహ్రూ పేరుతో క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమని, యువతీ యువకులు ఈ క్రీడల్లో రాణించేందుకు పోటీ పడాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలంలో 29వ అంతరాష్ట్ర నెహ్రూకప్ క్రికెట్ పోటీలను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆదివారం ఐటీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. జూనియర్ కళాశాల క్రీడామైదానంలో మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని, క్రీడామైదానంలో ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఐటీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఈ టోర్నమెంటు జరపడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి పంచాక్షరయ్య ట్రస్టు సభ్యులు వల్లూరిపల్లి వంశీ, టీడీపీ నాయకులు ఎస్కే. అజీమ్, నెహ్రూకప్ నిర్వాహకులు తోటమల్ల బాలయోగి, సురేష్‌బాబు, అట్లూరి శ్రీధర్, దాట్ల శ్రీనివాస రాజు, గుమ్మలూరి శ్రీనివాసరావు, సదానందం, మడిపల్లి నాగార్జున, పూనెం ప్రదీప్, విద్యాసాగర్, బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

**మూడు మ్యాచ్‌ల నిర్వహణ**

టోర్నీలో భాగంగా ఆదివారం మూడు మ్యాచ్‌లను నిర్వహించారు. ఉదయం వీసీసీ పాల్వంచ, న్యూస్టార్స్ కొత్తగూడెం జట్ల మధ్య జరిగింది. పాల్వంచ జట్టు 16 ఓవర్లలో 134 పరుగులు చేయగా న్యూస్టార్స్ జట్టు 13.1 ఓవర్లలోనే 136 పరుగులు చేసి విజయం సాధించింది. చర్ల బ్లూస్టార్, ఫ్రెండ్స్ ఎలెవెన్ సారపాక జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో చర్ల బ్లూస్టార్ జట్టు 12 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 92 పరుగులు చేసింది. అనంతరం ఫ్రెండ్స్ ఎలెవెన్ సారపాక జట్టు నిర్ణీత 12 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 74 పరుగులకు ఆలౌటయ్యింది. మూడో మ్యాచ్‌లో ప్రతాప్ ఎలెవెన్ మణుగూరు జట్టు, భద్రాచలం క్రికెట్ అకాడమీ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన మణుగూరు జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 87 పరుగులు సాధించింది. అనంతరం బీసీఏ జట్టు 7.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 90 పరుగులు చేసి విజయం సాధించింది.

## దక్షిణ అయోధ్యకు అధ్యయనోత్సవ శోభ

- రేపటి నుంచి దశావతారాల్లో రామయ్య దర్శనం
- భద్రాద్రికి పోటెత్తుతున్న భక్తులు

భద్రాచలం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రం అధ్యయనోత్సవ శోభను సంతరించుకుంది. ఎటు చూసినా స్వాగత ద్వారాలు, విద్యుత్తు దీపాల వెలుగులతో ప్రకాశిస్తున్న రామాలయం పరిసరాలు, అధ్యనోత్సవ వేదికతో ఉత్సవ కళ ఉట్టిపడుతోంది. సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ప్రతి రోజు ఒక అవతారంలో భద్రాద్రి రామయ్య భక్తులకు దర్శనమివ్వనున్నారు. తొమ్మిదో తేదీన గోదావరిలో స్వామి వారికి తెప్పోత్సవం నిర్వహించనుండగా 10వ తేదేన వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తరద్వారంలో స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. దీంతో భద్రాచలంలో ఎటు చూసినా అధ్యయనోత్సవాల పండుగ వాతావరణం నెలకొంది. ఇప్పటికే నిత్యం వేలాది మంది భక్తులు రామయ్య దర్శనం కోసం తరలివస్తుండటంతో భద్రాద్రి భక్తాద్రిగా మారుతోంది.

**రామయ్యను దర్శించిన పలు దేశాలకు చెందిన ఇస్కాన్ సభ్యులు**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో ముక్కోటి ముందే వచ్చిందా అన్నట్లు భక్తులు పోటెత్తారు. వరుస సెలవులతో పాటు ఏడాది ముగింపు కావడంతో భద్రాచలానికి భక్తుల తాకిడి పెరిగింది. గత ఎనిమిది రోజుల్లో భద్రాద్రి రామయ్యను 7,2500 మంది భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం భద్రాద్రి రామయ్య దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. అంచనాలకు మించి భక్తులు తరలివస్తుండటంతో పట్టణంలోని లాడ్జీలు, దేవస్థానం కాటేజీలు, సత్రాలు పూర్తిగా నిండిపోయాయి. రామయ్య దర్శనం కోసం భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. భక్తులు భారీగా తరలిరావడంతో దేవస్థానం అధికారులు అంతరాలయంలో ఆర్జిత సేవలను నిలిపివేసి శీఘ్ర దర్శనం, ఉచిత దర్శనాలను కొనసాగిస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేశారు. గడిచిన ఎనిమిది రోజుల్లో దేవస్థానానికి రూ.1 కోటి 5లక్షల 45 వేల 443 ఆదాయం లభించింది.

**రత్నాంగి అలంకారంలో భద్రాద్రి రామయ్య**

హైదరాబాద్‌కు చెందిన భక్తులు పిన్నమనేని బాలమురళీకృష్ణ-శాంతి కుటుంబ సభ్యులు అందజేసిన రూ.40లక్షల విలువైన రత్నాంగి కవచాన్ని శనివారం భద్రాద్రి సీతారామచంద్రస్వామి మూలవరులకు అలంకరించారు. భక్తులు ఈ రత్నాంగి అలంకారంలో రామయ్యను దర్శించుకున్నారు.

**రామయ్యను దర్శించుకున్న విదేశీ భక్తులు**

భద్రాద్రి రామయ్యను ఆదివారం పలు దేశాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. ఇస్కాన్‌కు చెందిన అధ్యాత్మిక గురువు నరసింహ మహారాజ్ ఆధ్వర్యంలో ఇండియాతో పాటు స్కాట్‌ల్యాండ్, ఆస్ట్రేలియా, చైనా, తైవాన్, సింగపూర్, మలేషియాకు చెందిన 60 మంది ఇస్కాన్ భక్తులు భద్రాద్రి రామయ్యను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## జీవిలోని భగవంతుడికి సేవచేయాలి

సత్తుపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతి జీవిలో ఉన్న భగవంతుడికి సేవ చేయాలని, దేశానికి ఉపయోగపడని దేహం, డబ్బు ఎంత పెరిగినా వృథానే అని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద పేర్కొన్నారు. సత్తుపల్లిలోని మాధురి ఫంక్షన్‌హాల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి రామకృష్ణ-వివేకానంద భావప్రచార పరిషత్ 6వ భక్త సమ్మేళనం ఆదివారంతో ముగిసింది. చివరిరోజు కార్యక్రమాల్లో ముందుగా జేవీఆర్ పార్క్ ఎదుట నూతనంగా నిర్మించిన వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్స్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన 4వ సమావేశంలో స్వామి యోగీశానంద, సేవ్యానంద, సుకృతానందలు ప్రసంగిస్తూ స్వామి వివేకానంద మనకు 1,500సంవత్సరాలకు సరిపడా ఆధ్యాత్మిక సంపదను ప్రసాదించారని తెలిపారు. అలాగే రామకృష్ణ, వివేకానంద సేవాసంస్థలు ప్రపంచానికి అన్ని రకాల సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. లోకకల్యాణం కోసం రామకృష్ణ, శారదాదేవీలు తపస్సు చేశారన్నారు. చీత్కారాలు, అవమానాలు ఎన్ని ఎదురైనా బురదలో తామర పువ్వులాగా నిలబడాలన్నారు. చుట్టుపక్కల ఎంత కల్మషం ఉన్నా శారదమ్మ వలే పవిత్రంగా ఉండాలని సూచించారు. శారదమ్మ ఏ మతస్థులు, కులస్థులు వచ్చినా అక్కున చేర్చుకునే మంత్ర దీక్ష ఇచ్చి వారిలోని పాపాలను జపం ద్వారా స్వీకరించేవారన్నారు. స్వామి వివేకానంద విద్యార్థి జీవితంలో కొన్ని నెలల పాటు ఆకలితో అలమటించారన్నారు. జగన్మాత కార్యాన్ని చేసే క్రమంలో ఎన్నో కష్టాలు, నష్టాలు ఓర్చుకుని ఒకే లక్ష్యమైన ఆధ్యాత్మిక సంపదను ప్రపంచానికి పంచిపెట్టేందుకు భగవంతుడిపై ఆధారపడి ముందుకు సాగారన్నారు. అలా మన దేశ ప్రతిష్ఠతను, సనాధన ధర్మ ప్రతిష్ఠతను, సంస్కృతి, సంప్రదాయాలను విశ్వమానవాళికి తెలియజేప్పిన అనంతరం మన దేశానికి వచ్చి శ్రీ రామకృష్ణ సంఘమనే మహాసంస్థను స్థాపించారన్నారు.

**ముగిసిన భక్త సమ్మేళనం**

తెలుగు రాష్ట్రాల స్థాయిలో సత్తుపల్లిలో రెండోసారి నిర్వహించిన 6వ భక్త సమ్మేళనం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల నుంచి స్వామిజీలు, మాతాజీలు, భక్తులు వందలాదిగా తరలివచ్చారు. గుంటూరు శారదామఠం బాధ్యులు బోధమయప్రాణ మాతాజీ, త్యాగనిష్ఠాప్రాణ మాతాజీ, సేవ్యానందజీ, సన్నివాసానందజీ, అమిరపు నటరాజన్, కే.సత్యప్రసాద్‌రాయ్, పూజానానందజీ, సత్యచైతన్య, ప్రశాంత్‌చైతన్య, పరాశం ప్రసాద్‌లు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్ సీ.రంగాచార్యులు బృందంచే సంగీత విభావరి, చామనపల్లి కళాబృందం భజనలు, విద్యార్థులచే నృత్యాలు అలరించాయి. రామచంద్ర మిషన్, సత్యసేవ సమితి, చిన్నజీయర్‌స్వామి సభ్యులు వలంటీర్లుగా పనిచేశారు. కార్యక్రమంలో ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.



భక్త సమ్మేళనానికి హాజరైన భక్తులు

## సర్వే సంకటం

(5వ పేజీ తరువాయి)

అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇలా గ్రామాల్లో పదులసంఖ్యలో పేర్లు గల్లంతైనట్లు తెలుస్తోంది. తాము దరఖాస్తు చేసినట్లు బాధితులు సర్వేకు వచ్చిన అధికారులకు చెబుతున్నా దరఖాస్తు వివరాలు లేకుండా సర్వేలో వివరాల నమోదుకు తమకు ఎలాంటి అధికారాలు లేవని, ఈ సమస్యపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవాలని సర్వే సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా ఉండేందుకు యాప్‌ను రూపొందించినా అందులో అర్హుల పేర్లు మిస్‌కావడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**గడువు దగ్గరపడుతుండటంతో ఆందోళన**

ఇందిరమ్మ ఇళ్ల సర్వే గ్రామాల్లో వేగంగా జరుగుతోంది. ఈ క్రమంలో పేర్లు గల్లంతైన దరఖాస్తుదారులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. డిసెంబరు 31కల్లా సర్వే పూర్తిచేయాలని పైనుంచి ఆదేశాలు ఉన్నట్లు అధికారులు చెపుతున్నారు. కానీ గ్రామాల్లో ఇంకా 60-70శాతం మాత్రమే ఇప్పటి వరకు సర్వే పూర్తయింది. ఈ క్రమంలో పేర్లు మిస్ అయిన దరఖాస్తుదారులతో పాటు, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు ఇక్కడకు వచ్చి సర్వేలో పాల్గొనేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరుతున్నారు. సమస్య మరింత జటిలం కాకముందే అర్హులైన పేదలందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నారు.

## మార్పులకు పెద్దపీట

ఖమ్మం, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో జిల్లాలో బోలెడన్ని మార్పులు రికార్డయ్యాయి. ప్రభుత్వం మారడంతో జిల్లాలో ఉన్నతాధికారులు మారారు. ప్రధాన పోస్టుల్లో కొత్త అధికారులు చార్జ్ తీసుకున్నారు. జాతీయ రాజకీయ నాయకులు జిల్లాపై ఫోకస్ పెంచారు. ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాలుగు పర్యాయలు పర్యటించారు. బడా నేతలతో పాటు విద్యావేత్తలు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుల పర్యటనలు జిల్లాలో సాగాయి. కొత్త ప్రభుత్వంలో కలెక్టర్లు, ఎస్పీలతోపాటు, ఉన్నతాధికారుల మార్పులు జరిగాయి.

**నియామకాలు.. బాధ్యతలు**

ఖమ్మం పోలీసుకమిషనర్‌గా సునీల్‌దత్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీగా రోహిత్‌రాజ్ జనవరి నెలలో బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం గ్రంథాలయం భవనం కూలగా పెనుప్రమాదం తప్పింది. సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో బాతుపిల్లలతో ఆడుకుంటూ నీటిగుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. 59 జీవో అక్రమబద్ధీకరణ వ్యవహారంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అరెస్టు చేశారు. డీసీఎంఎస్ ఛైర్మన్‌గా కొత్వాల శ్రీనివాసరావుకు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. డీసీసీబీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం వీవీపాలెం సొసైటీ ఛైర్మన్ పదవిపై 11మంది సభ్యులు అవిశ్వాస తీర్మానం చేశారు.

**డీసీసీ ఛైర్మన్‌గా దొండపాటి..**

ఫిబ్రవరిలో డీసీసీబీ వైస్‌ఛైర్మన్‌గా ఉన్న దొండపాటి వెంకటేశ్వరరావు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. అనంతరం ఆయన డీసీసీబీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. వీపాలెం సొసైటీ కాంగ్రెస్ కైవసం కాగా ఛైర్మన్‌గా రావూరి సైదబాబు ఎన్నికయ్యారు. అక్రమంగా ఇంటి నిర్మాణం చేశారంటూ మాజీ అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్‌పై కేసు నమోదయింది. ఖమ్మం స్వర్ణభారతి కళ్యాణ మండపంలో మార్చిలో మాజీప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణకు అభిమానులు సన్మానం చేశారు. మణుగూరు, భద్రాచలం ప్రజాదీవెన సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఖమ్మంలో రాష్ట్ర కుటుంబ ఆరోగ్యసంక్షేమశాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు చేశారు.

**ఖమ్మం టూ పారిస్**

పారిస్‌లో జరిగే ప్రపంచ పారా అథ్లెటిక్ పోటీలకు మార్చి నెలలో ఖమ్మంకు చెందిన బత్తుల శ్రీను ఎంపికయ్యారు. బోనకల్లు మండలం గోవిందాపురంఎల్ గ్రామానికి చెందిన సాయి అలేఖ్య సివిల్స్‌లో 938వర్యాంకు సాధించింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం రోడ్‌షోలో బీజేపీ జాతీయ నేత కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొన్నారు. కొత్తగూడెంలో జరిగిన బీజేపీ బహిరంగసభలో బీజేపీజాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొన్నారు. మేలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కొత్తగూడెంలో నిర్వహించిన జనజాతర సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల ప్రచారంలో హీరో దగ్గుబాటి వెంకటేష్ రోడ్‌షోలో పాల్గొన్నారు.

**జిల్లా పాలనాధికారుల మార్పు..**

ఖమ్మం కలెక్టర్‌గా ముజమ్మిల్‌ఖాన్, భద్రాద్రి కలెక్టర్‌గా జితేష్‌వీపాటిల్ బాధ్యతల స్వీకరించారు. ఖమ్మం కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా అభిషేక్ అగస్త్య, ఐటీడీఏ నూతన పీవోగా రాహుల్ బాధ్యతలు స్వీకరించారు. మణుగూరు మండలం కూనవరం గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత డోలి వాయిద్య కళాకారుడు సకిని రామచంద్రయ్య మృతి చెందారు. జూలైలో రాష్ట్ర అటవీసంస్థ ఛైర్మన్‌గా పొదెం వీరయ్య, నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా మువ్వా విజయ్‌బాబు, రాష్ట్రగిడ్డంగుల సంస్థ ఛైర్మన్‌గా రాయల నాగేశ్వరరావు, హస్తకళా అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నాయుడు సత్యనారాయణ నియమితులయ్యారు. కొత్తగూడెంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పర్యటించారు. డార్క్ వెబ్‌లో డ్రగ్స్ కొనుగోలు చేసిన ఖమ్మం యువకుడుని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టును ప్రారంభించి, రూ.2లక్షల రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

**బాధితులకు సీఎం పరామర్శ..**

సెప్టెంబరులో ఖమ్మంను వరద ముంచెత్తింది. వరద బాధితులను పరామర్శించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఖమ్మం వచ్చారు. వరదనష్టాన్ని కేంద్రబృందం పరిశీలించింది. కొత్తగూడెంలో ఓ ప్రైవేటు షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో సినీ హీరోయిన్లు పాయల్‌రాజ్‌పుత్, నెహా శెట్టి పాల్గొన్నారు. అక్టోబరులో అశ్వారావుపేటలో ఆయిల్ ఫెడ్ పవర్ ప్లాంట్ ప్రారంభమయింది. మధిర మండలం సిరిపురంలో సోలార్ పవర్ ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పర్యటన సాగింది. నవంబరులో కొత్తగా పోస్టింగులు ఇచ్చిన ఏడుగురు హిందీపండిట్లను నవంబరులో తొలిగించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీల కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య పర్యటించారు. ఖమ్మం వ్యవసాయమార్కెట్‌ను హరీష్‌రావుతో కలిసి బీఆర్ఎస్ బృందం సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# క్రైం సమాచారం

## విద్యుదాఘాతంతో పాస్టర్ మృతి

మధిర రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ చర్చి పాస్టర్ మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి మధిర మండలం దెందుకూరు గ్రామంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దెందుకూరులో మీసాల శ్రీనివాసరావు (58)చర్చి పాస్టర్‌గా పనిచేస్తుంటాడు. గ్రామశివారులో గల చేపల చెరువును వేలంలో దక్కించుకున్నాడు. రాత్రి సమయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు కొంతమంది చెరువులో దొంగతనంగా చేపలు పడుతున్నట్లు పాస్టర్ శ్రీనివాసరావు దృష్టికి వచ్చింది. దీంతో శ్రీనివాసరావు శనివారం రాత్రి పదిగంటల సమయంలో ఇంటి నుంచి చేపల చెరువు వద్దకు కృష్ణ అనే వ్యక్తితో కలిసి వెళ్లాడు. చేపల చెరువు సమీపంలో పక్కనే ఉన్న పత్తిపొలంలో వన్యప్రాణాలను వేటాడేందుకు విద్యుత్ తీగెను ఏర్పాటుచేశారు. రాత్రి చీకటి కావడంతో పత్తి పొలంలో నుంచి చెరువుకు వెళ్తుండగా విద్యుత్ తీగె తగలడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. దీంతో గమనించిన కృష్ణ పొలాల వద్దనున్న మరో వ్యక్తి సహాయంతో ఆసుపత్రిలో చేరేందుకు రోడ్డుకు తీసుకువచ్చే సమయంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలున్నారు. ఘటనాస్థలాన్ని ఆదివారం ఉదయం మధిర సీఐ డి.మధు, రూరల్ ఎస్‌ఐ లక్ష్మీభార్గవి సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పాస్టర్ మృతదేహం

## ప్రమాదవశాత్తు మత్స్యకారుడి మృతి

కల్లూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముగ్గువెంకటాపురం గ్రామంలో చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకార్మికుడు వలలో చిక్కుకొని ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ముగ్గువెంకటాపురానికి చెందిన మత్స్యకార్మికుడు అక్కల వెంకటేశ్వర్లు (35) శనివారం సాయంత్రం, సమీపాన గల మహాలింగం కుంట చెరువు వద్దకు వెళ్లాడు. చేపల వేట కోసం రాత్రి పూట చెరువులో వల వేయగా అది కాళ్లకు చుట్టుకొని ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆదివారం ఉదయం వరకు వెంకటేశ్వర్లు ఇంటికి రాక పోవటంతో గ్రామంలోని సహచర కార్మికుడు మెరుగు గోపి చెరువు వద్దకు వెళ్లి చూడగా కట్టపై చెప్పులు, చొక్కా కనపడగా వెంకటేశ్వర్లు కోసం కేకలు వేయగా కనిపించలేదు. దీంతో చెరువులో థర్మకోల్ షీట్ పడవ ఉండటంతో అనుమానం వచ్చి చెరువులో దిగి అందులో ఉన్న వలను లాగి చూడగా వెంకటేశ్వర్లు మృతదేహం కాళ్లకు వల చిక్కుకొని ఉంది. మృతి చెందిన మత్స్యకార్మికుడు చేపల వేటను జీవనాధారం చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడని తెలిసింది. మృతునికి భార్య లక్ష్మితో పాటుగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదుతో ఎస్‌ఐ నివేదిత కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.


వెంకటేశ్వర్లు (ఫైల్)

## విధులకు ఆటంకం కలిగించిన యువకుడిపై కేసు

జూలూరుపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పోలీస్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన యువకుడిపై జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆదివారం పోలీస్‌లు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఏన్కూర్ మండలం పరిధిలోని ఒంటిగుడిసె భద్రుతండా గ్రామానికి చెందిన బాదావత్ కామేష్ అనే యువకుడు శనివారం రాత్రి చంద్రుగొండ నుంచి జూలూరుపాడు వైపు ఆటోను అతివేగంగా నడుపుకుంటూ వస్తున్నాడు. ఆ సమయంలో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా జూలూరుపాడులోని చంద్రుగొండ క్రాస్ రోడ్డు వద్ద హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, సిబ్బంది సురేష్, కుటుంబరావు విధులు నిర్వహిస్తున్నారు. ఆటోను ఆపాలని వారు ప్రయత్నించగా సదరు యువకుడు ఆపకుండా వెళ్లిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. దీంతో నా ఆటోను ఆపడానికి మీకు హక్కు ఎవరిచ్చారంటూ యువకుడు హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడు. హెడ్‌కానిస్టేబుల్‌ను బలంగా నెట్టివేశాడు. విధి నిర్వాహణలో ఉన్న సిబ్బంది విధులకు ఆటంకం కలిగించటంతో హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ ఫిర్యాదు మేరకు సదరు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.రవి తెలిపారు.

## జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీ కొట్టిన కారు

- అదుపు తప్పి మరో కారుకు ఢీ
- రెండు కార్లలో నలుగురికి గాయాలు

కూసుమంచి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి మండలం జీళ్లచెరువు సమీపంలో ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కూసుమంచి ఎస్‌ఐ శ్రీధరాచారి కథనం ప్రకారం హైదరాబాద్ నుంచి ఖమ్మంవైపు వెళుతున్న కారు అదుపుతప్పి రహదారి డివైడర్‌ను బలంగా ఢీకొట్టిన కారు.. అదుపుతప్పి వెనుక వెళ్తున్న మరోకారును ఢీకొట్టింది. దీంతో రెండు కార్లలో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. పల్టీకొట్టిన కారులో సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన 18 డివిజన్ మాజీ కౌన్సిలర్, టీడీపీ సీనియర్ నాయకుడు ఉప్పగళ్ల శ్రీనివాసరావుకు, చంచలగూడ జైల్లో హెడ్ కానిస్టేబుల్ వీరన్నకు, వెనకకారులో ప్రయాణిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి కాట్రగడ్డ ఆనందకృష్ణకు ఆయన కూతురు ప్రశాంతికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగ్రాతులను హైవేసిబ్బంది, స్థానిక పోలీసులు ఖమ్మంప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కూసుమంచి పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదానికి గురైన కారు

## అదుపుతప్పి బోల్తాపడిన కారు

ఆళ్లపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మూల మలుపులో అదుపుతప్పిన కారు బోల్తాపడిన సంఘటన ఆదివారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో జరిగింది. ఇల్లెందుకు చెందిన మెడికల్ డిస్ట్రిబ్యూటర్లు కారులో మండల పరిధిలో మర్కోడు వచ్చి తిరిగి ఇల్లెందు వెళ్తున్న క్రమంలో ఆళ్లపల్లిలోని పెట్రోల్ బంక్ వద్ద మూలమలుపులో అదుపుతప్పి కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి స్వల్ప గ్రాయాలతో బయటపట్టారు.



## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

జూలూరుపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటనర్సాపురంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లో కెళితే మండలంలోని వెంగన్నపాలెం పంచాయతీ మాజీ ఉపసర్పంచ్, యువకుడు దేవరకొండ కిరణ్ ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం వెళ్లి తిరిగి ఇంటికి జూలూరుపాడు వస్తున్నాడు. ఈ క్రమంలో పడమటనర్సాపురంలో ఒక్కసారిగా పందిపిల్ల అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడింది. ఈ సంఘటనలో ఆయనకు తీవ్ర గా యాలు కాగా చికిత్సను అందించేందుకు కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు.

## ఆగి ఉన్న కారును ఢీ కొట్టిన లారీ

ఖమ్మం క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కారుని వెనుకనుంచి ఓ లారీ ఢీ కొట్టిన సంఘటన ఆదివారం సాయంత్రం ఖమ్మం నగరంలో జరిగింది. ఖమ్మంలోని బాలాజీనగర్‌కు చెందిన పసుమర్తి లక్ష్మీనరసింహారావు అనే వ్యక్తి తన కారులో వస్తూ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఆదివారం సాయంత్రం సిగ్నల్ పడటంతో ఆపాడు. దీంతో వెనకనుంచి ఓ లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది.

దీంతో కారు వెనకభాగం ధ్వంసం అయింది. కారులో ఉన్నవారికి స్వల్పగాయాలు కావడంతో స్థానికులు ఓ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

## విద్యార్థి అదృశ్యం..

ఇల్లెందు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పట్టణానికి చెందిన ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. పట్టణంలో అంబజార్ మసీదు మౌల్వి మహమ్మద్ అఖిల్ కుమారుడు మహమ్మద్ ముస్రాఫ్ అబ్రా (19) కొత్తగూడెంలో దారుల్ ఉలుం మదర్శాలో ఉర్దూ కోర్సు చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం ఇల్లెందు నివాసానికి వచ్చి శనివారం కొత్తగూడెం మదర్శాకు వెళ్లాడు. కానీ ఆ విద్యార్థి మదర్శాకు చేరలేదు.

బంధువుల స్నేహితుల నివాసాల్లో ఆచూకీ కోసం యత్నించినా ఆచూకీ లభ్యం కాలేదని తండ్రి ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

# మరమ్మతుల పేర రోడ్ల ధ్వంసం

- రూ. కోట్లతో రోడ్లు నిర్మించి, డ్రెయినేజీ, విద్యుత్ దీపాల కోసం తవ్వకం
- ఇంజనీరింగ్ అధికారుల అవగాహన లోపంతో ప్రభుత్వంపై ఆర్థిక భారం


వీధి దీపాల కోసం విద్యుత్‌పోల్ ఏర్పాటు చేసిన దృశ్యం

కొత్తగూడెం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం మునిసిపాలిటీలోని అంతర్గత రహదారుల నిర్మాణం కోసం కోట్లాది రూపాయల వ్యయంతో సీసీ రోడ్లను నిర్మిస్తున్నారు. తరువాత డ్రెయినేజీ, కేబుల్ వర్క్స్ తదితర పేర్లతో రోడ్లను తవ్వుతున్నారు. దీంతో కోట్లాది రూపాయలు పెట్టి నిర్మితమైన రోడ్లను తవ్వుతున్నారు. దీంతో ప్రజాధనం వృథాగా పోతోంది. డిస్ట్రిక్ మినరల్ ఫండ్‌తో కొత్తగూడెం మునిసిపాలిటీలో సుమారు రూ.70కోట్ల పనులను మనిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు నిర్వహిస్తున్నారు. అధికారుల అవగాహన లోపం కారణంగా ప్రభుత్వంపై ఆర్థికభారం పడుతోంది. రోడ్లు వేసే సమయంలోనే డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చే పనితోపాటు వీధిలైట్ల ఏర్పాటు కోసం ముందస్తుగా చర్యలు చేపట్టి ఉంటే ప్రయోజనం ఉండేది. రోడ్లు వేసిన రెండు, మూడు నెలల వ్యవధిలోని వీధిలైట్ల ఏర్పాటు కోసం వేసిన రోడ్లను తవ్వి కేబుల్ కోసం ఉపయోగిస్తున్న పరిస్థితి మున్సిపాలిటీలో నెలకొంది. రైతుబజారు నుంచి ఇండియన్ గ్యాస్ వైపు వేసిన రోడ్లను అధికారులు తవ్వి వీధిదీపాలు ఏర్పాటుచేయడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముందుగానే విద్యుత్ దీపాల కోసం కేబుల్ వేసి రోడ్డు వేస్తే రోడ్‌కట్టింగ్‌చేయాల్సిన అవసరం ఉండేది కాదని పలువురు ఆరోపిస్తోన్నాయి. కోట్ల రూపాయలను వెచ్చించి రోడ్లను వేస్తున్న అధికారులు లక్షలాది రూపాయల వ్యయంతో రోడ్లను తవ్వుతున్న పరిస్థితులు ఎదురవుతున్నాయి. మునిసిపల్ అధికారులు రోడ్లు వేసే సమయంలోనే భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందని పలువురు ప్రశ్నిస్తోన్నారు. ఈ విషయంపై మున్సిపల్ డీఈని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

## గ్రానైట్ పరిశ్రమ అభివృద్ధికి సహకరిస్తా

### ఎంపీ వద్దిరాజు



ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 29 (ఆంధ్యజ్యోతి): గ్రానైట్ పరిశ్రమకు ఖమ్మం జిల్లా పెట్టింది పేరని, దీని అభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తానని, ఇందులో పనిచేస్తున్న వారి సంక్షేమానికి ఎల్లవేళలా అండగా ఉంటానని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరై మాట్లాడారు. ఈ జిల్లాలోని గనుల నుంచే ఢిల్లీలో ఉన్న పోలీస్ జాతీయ స్మారక మ్యూజియానికి, ఇండియా గేట్ వద్ద నెలకొల్పిన సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి గ్రానైట్ ను అందజేశారని, ఇది మనందరికి గర్వ కారణమని ఎంపీ రవిచంద్ర అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్‌లో బంగారం దొంగ అరెస్ట్

ఖమ్మం క్రైం డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని రైల్వేస్టేషన్‌లో బంగారం దొంగను రైల్వే పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. జీఆర్పీ పోలీసులు రైల్వే స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారం పై తనిఖీలు నిర్వహిస్తుండగా ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెం గ్రామానికి చెందిన నాగెల్లి వరకుమార్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఒక చోట బంగారం చోరీ చేసినట్టు తెలిపాడు. దీంతో అతడి వద్దనుంచి 5తులాల బంగారం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

## చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

కొణిజర్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వెంచర్‌లోని తమ కార్యాలయంలో కూర్చొనగా వెంచర్‌కు సంబంధించిన ప్రాజెక్టు సిబ్బంది తమల్ని ఆఫీస్ నుంచి బయటకు నెట్టి చంపుతామని బెదిరించారని ముళ్ల కిషోర్ అనే వ్యక్తి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ సూరజ్, బాధితుడి కథనం ప్రకారం కొణిజర్ల, లింగగూడెం, అమ్మపాలెం రెవెన్యూ పరిధిలో కొణిజర్ల సమీపంలో 180 ఎకరాలలో వెంచర్ వేశామని, అందులో 1800 గజాలలో ఆఫీస్‌ను ఏర్పాటు చేశామన్నారు. వెంచర్ డెవలప్ మెంట్‌కు మరో ప్రాజెక్టు ఎండీకి పది ఎకరాలు ఇవ్వగా విల్లాలు కట్టుకున్నాడని అన్నారు. అతను తమ ఆఫీస్‌లోని కొంతభాగం కూడా వాడుకుంటున్నారని ఫిర్యాదులో తెలిపాడు. నేపథ్యంలో తమ ఆఫీస్‌లో తము కూర్చొని మాట్లాడుకుంటుండగా తనకు సంబంధించిన ప్రాజెక్టు సిబ్బంది తనతో పాటు తనకు సంబంధించిన కొందరిని ఆఫీస్ నుంచి బయటకు నెట్టారని, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఫిర్యాదులో కోరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తామనిఎస్‌ఐ పేర్కొన్నారు.

## మట్టి ట్రాక్టర్ల పట్టివేత


పోలీసుస్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

కొణిజర్ల, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండ తోలుతున్న ఏడు మట్టి ట్రాక్టర్‌లను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సూరజ్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ప్రకారం తనికెళ్ల సమీపంలోని గుట్ట ప్రాంతంలో ఎటువంటి అనుమతులు పొందకుండ మట్టితోలకాలు జరుపుతున్నారని, తమకు సమాచారం రావడంతో ఆదివారం తెల్లవారుజామున తనికెళ్ల నుంచి కొణిజర్ల వస్తున్న ఏడు మట్టితో ఉన్న ట్రాక్టర్‌లను పట్టు కున్నట్టు తెలిపారు. దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

ఖమ్మంక్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులకు ఖమ్మం స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి మూడురోజుల శిక్ష విధించినట్టు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తూ మద్యం మత్తులో పట్టుబడిన వారిపై న్యాయస్థానాల్లో చార్జిషీట్‌లు దాఖలు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో ఇటీవల మద్యం సేవిస్తూ తనిఖీల్లో పట్టుబడిన నగరానికి చెందిన ఆటో డ్రైవర్‌కు మూడు రోజుల శిక్ష విధించడంతో పాటు మరికొందరికి రూ.రెండువేలనుంచి మూడువేల వరకు జరిమాన విధించారని తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదాల సంఖ్య భారీగా పెరుగుతుందని, ఒక్కరి అజాగ్రత్త ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదం నింపుతుందన్నారు. కొన్నిసార్లు మనం కరెక్టుగా వెళ్తున్నా అవతలి వారి నిర్లక్ష్యం ప్రాణాలను హరిస్తుందని, అయితే ఎక్కువ కేసుల్లో ప్రమాదాలకు మద్యం మత్తే కారణం అవుతున్నారని ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలోనే రోడ్డు ప్రమాదా నివారణే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారని ప్రకటనలో తెలిపారు.

## ఏఐటీయూసీ సీనియర్ నాయకుడి మృతి


నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందు టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ సీనియర్ నాయకులు, సింగరేణి మాజీ కార్మికుడు గడ్డం రాజయ్య (70) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇల్లెందు పట్టణంలోని జేకేకాలనికి చెందిన రాజయ్య మృతి పట్ల ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతదేహంపై ఎర్రజెండా కప్పి పూలమాలలు వేశారు. సీపీఐ రాష్ట్ర నాయకులు కే. సారయ్య మాట్లాడుతూ గడ్డం రాజయ్య ఇల్లెందు ఏరియా వర్క్‌షాపులో ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ ఏఐటీయూసీలో కీలకంగా పని చేశారని గుర్తు చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి బందం నాగయ్య, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి ఎండీ. నజీర్ అహ్మద్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బాసా శ్రీనివాస్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు దాసరి రాజారాం, మంచాల వెంకటేశ్వర్లు, బొల్లి కొమరయ్య, సత్యనారాయణ, భాస్కర్, వడ్ల శ్రీనివాస్, బంటు యాదగిరి, వలీ, రాఘవేందర్‌రావు ఉన్నారు.

## గుండెపోటుతో హమాలీ నాయకుడి మృతి

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): షాపింగ్ హమాలీ, సివిల్ సప్లయ్ హమాలీ సంఘ కార్మికుడు స్థానిక శ్రీనివాసా టాకీస్ రోడ్‌కు చెందిన ఎస్కే బాజీ (52) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. బాజీ మృతిపట్ల నాయకులు బండి రఘుపతిరెడ్డి, కొలికపోగు సర్వేశ్వరరావు, మోరంపూడి పాండు రంగారావు, జాజిరి శ్రీనివాస్, రావుల రాజబాబులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వలీ, సైదా, వెంకటేశ్వరరావు, బడేమియా, జిలానీ, బుడే, చంద్రం, నబీ, రాము, అర్జున్, రాంబాబు, కోటయ్య, మారేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


బాజీ (ఫైల్)

## సీఎం కప్ రాష్ట్ర పోటీలలో జిల్లా క్రీడాకారుల హవా



ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలలో కాంస్య పతకం సాధించిన టేబుల్ టెన్నిస్ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలలో భాగంగా ఈనెల 27 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల జరిగిన టేబుల్ టెన్నిస్ పోటీలో జిల్లా బాలుర, బాలికల జట్లు ప్రథమ స్థానాల్లో నిలిచి చాంపియన్ షిప్ సాధించగా, వెయిట్ లిఫ్టింగ్ పోటీలో జిల్లా క్రీడాకారులు అభిరాం స్వర్ణ, ప్రేమ్‌కుమార్ రజత, ఉదయ్‌కుమార్, సాత్విక కాంస్య పతకాలు సాధించారు. అంతే కాకుండా ఉషూ పోటీలలో సాయిభవ్యశ్రీ స్వర్ణ పతకం సాధించగా యువన్‌తేజ్‌చౌహాన్ ప్రహర్షన్‌పాల్ కాంస్య పతకాలు సాధించారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన మహిళల ఫుట్‌బాల్ పోటీలో జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించి టైటిల్ నిలబెట్టుకుంది. ఖమ్మం నగరంలో జరుగుతున్న వాలీబాల్ పోటీలలో సైతం జిల్లా బాలురు, బాలికల జట్లు తృతీయ బహుమతిని సాధించాయి. రాష్ట్ర పోటీలలో ప్రతిభ చూపిన జిల్లా క్రీడాకారులను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

## సీఎంకప్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ విజేత

# ఖమ్మం మహిళల జట్టు


ప్రథమ బహుమతి సాధించిన ఖమ్మం మహిళల ఫుట్‌బాల్ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 నుంచి 29 వరకు హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన సీఎం కప్ రాష్ట్రస్థాయి మహిళల ఫుట్‌బాల్ పోటీలలో ఖమ్మం జిల్లా మహిళల జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఉత్కంఠ ఫైనల్ మ్యాచ్‌లో నిజామాబాద్ జట్టుపై మొదటగా 1-1 స్కోరు తేడాతో డ్రా చేసుకొని అనంతరం పెనాల్టీ షూటౌట్‌లో 4-3 స్కోరు తేడాతో విజయం సాధించి టైటిల్ నిలబెట్టుకుంది. రాష్ట్ర పోటీలలో విజయం సాధించిన ఖమ్మం జట్టును జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సెల్యూకస్, సెక్రెటరీ ఆదర్శ్‌కుమార్, పలువురు సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి: నలుగురి అరెస్టు

మధిర రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మహదేవపురం గ్రామంలో ఓ ఇంటివద్ద పేకాట ఆడుతున్న స్థావరంపై ఆదివారం రాత్రి టౌన్ పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. గ్రామంలో ఓ ఇంటివద్ద పేకాట ఆడుతున్నట్లు టౌన్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో టౌన్ ఎస్‌ఐ ఎన్.సంధ్య తమసిబ్బందితో కలిసి స్థావరంపై దాడిచేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్న కనపర్తి నర్సయ్య, కనపర్తి నారాయణ, ఎల్లయ్య, జినుగు కృష్ణమూర్తిలను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.1800నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

## కోడిపందాల స్థావరంపై..

పెనుబల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాత కారాయిగూడెం గ్రామశివారులో కోడిపందాల స్థావరంపై వీఎంబంజర్ ఎస్‌ఐ వెంకటేష్ సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో రెండు కోడిపుంజులు, రెండు కత్తులు స్వాధీనంచేసుకొని 12మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ తెలిపారు.

## రఘునాథపాలెం మండలంలో వ్యవసాయ మోటార్ల చోరీ

రఘునాథపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండలంలో రైతుల మోటార్లు వరుసగా చోరీకి గురి అవుతున్నాయి. దీంతో రైతుల్లో కలవరం మొదలైంది. వరుస చోరీల ఘటనలతో రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఆదివారం సైతం రఘునాథపాలెం మండలం కోయచెలక గ్రామానికి చెందిన అమరం పరమయ్య వ్యవసాయ భూమిలోని విద్యుత్ మోటరు చోరీకి గురైంది. శనివారం సాయంత్రం వరకు కుటుంబ సభ్యులతో కలిసి పరమయ్య తన వ్యవసాయ భూమిలో పనులు చేస్తూ గడిపారు. మోటరుతో సాగు భూమికి నీరు పెట్టారు. ఆదివారం ఉదయం 5.30గంటలకే ఆదే వ్యవసాయ భూమికి వెళ్లి చూడగా మోటరుతో సహా బావిలోని పైపుతో సహా దొంగలు తష్కరించారు. దీంతో రఘునాథపాలెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

కూసుమంచి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళను లైంగికంగా వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసునమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీధరాచారి కథనం ప్రకారం మండలంలోని చేగొమ్మ గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త చనిపోవడంతో అక్కడే ఉంటూ వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో భర్త లేకపోవడంతో తన బంధువు లైంగికంగా వేధిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో రాజబాబు అదేగ్రామానికి చెందిన దాసరి రాంబాబు, అంబాల వీరబాబుతో కలిసి వచ్చి కొట్టి చంపుతానని బెదిరించాడు. ఈక్రమంలో అడ్డం వచ్చిన తన అత్తమామలు, ఇతర కుటుంబసభ్యులపైనా దాడి చేసి గాయపరిచాడు. దీంతో బాధితురాలు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



## నేడు నల్లగొండలో సీపీఐ బహిరంగసభ

ఖమ్మంటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా నల్గొండలోని ఎన్‌జీ కాలేజీలో సోమవారం నిర్వహించే బహిరంగసభకు అత్యధికంగా హాజరై జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం జిల్లా సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభకు హాజరయ్యే పురుషులు ఎర్రచొక్కాను, మహిళలు ఎర్రచీరెను తప్పనిసరిగా ధరించాలన్నారు. సమయపాలన పాటించి, క్రమశిక్షణతో సభకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నగర కార్యదర్శి ఎస్‌కే. జానీమియా, జిల్లా కార్యవర్గసభ్యులు బీజీ.క్లైమెంట్, కొండపర్తి గోవిందరావు, సింగు నర్సింహారావు, పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు.

### రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

| | |
|---|---|
| టమాటా | 18 రూ. |
| వంకాయ | 28 |
| గుత్తి వంకాయ | 40 |
| బీరకాయ | 44 |
| పచ్చిమిర్చి | 44 |
| కాకరకాయ | 38 |
| బెండకాయ | 38 |
| పొట్లకాయ | 38 |
| దోసకాయ | 38-40 |
| చిక్కుడు | 44 |
| నాటుచిక్కుడు | 68 |
| గోరుచిక్కుడు | 48 |
| క్యాబేజీ | 24 |
| దొండ | 46-50 |
| సొరకాయ | 20 |
| క్యారెట్ | 38 |
| క్యాప్సికం | 58 |
| ఆలుగడ్డ | 34 |
| ఉల్లిగడ్డ | 40-50 |
| కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు) | 180 |
| కొత్తిమీర కట్ట | 25 |

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

### CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

| | |
|---|---|
| వినోద: | ముఫాసా |
| శ్రీనివాస: | మ్యాక్స్ |
| సాయిరాం: | డ్రింకర్‌సాయి/యూఐ |
| కేపీఎస్: | పుష్ప 2 |
| తిరుమల: | పుష్ప 2 |
| సినీ గెలాక్సీ: | యూఐ |

### హలో ఆర్టీసీ

**ఖమ్మం కొత్త బస్టాండ్**

| | |
|---|---|
| డిపో మేనేజర్ల నెంబర్లు: | 9959225958 |
| బస్టాండ్ ఎంక్వయిరీ: | 9959225979 |
| కార్గోసేవల నెంబరు: | 9154298589 |

**ఖమ్మం పాతబస్టాండ్**

| | |
|---|---|
| డిపో మేనేజర్ల నెంబర్లు: | 9959225958 |
| బస్టాండ్ ఎంక్వయిరీ: | 9959225965 |
| కార్గోసేవల నెంబరు: | 9704345599 |

**సత్తుపల్లి బస్టాండ్**

| | |
|---|---|
| డిపో మేనేజర్ల నెంబర్లు: | 9959225962 |
| బస్టాండ్ ఎంక్వయిరీ: | 9959225990 |
| కార్గోసేవల నెంబరు: | 9154298595 |

**మధిర బస్టాండ్**

| | |
|---|---|
| డిపో మేనేజర్ల నెంబర్లు: | 9959225961 |
| బస్టాండ్ ఎంక్వయిరీ: | 7382925289 |
| కార్గోసేవల నెంబరు: | 8143765370 |

## తాగునీటి ఎద్దడి నివారణకు కృషి



హస్నాబాదులో తాగునీటిబోరును ప్రారంభిస్తున్న నరేష్‌రెడ్డి

తిరుమలాయపాలెం,డిసెంబరు29(ఆంధ్రజ్యోతి):తాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తామని జిల్లాకాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని హస్నాబాద్ గ్రామస్తులు తాగునీటి సమస్యతో ఇబ్బందిపడుతుండటాన్ని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. ఈనేపథ్యలో ఆదివారం తాగునీటి బోరును నరేష్‌రెడ్డి ప్రారంభించారు.మంత్రి కృషితో అన్నిగ్రామాల్లో తాగునీటి సమస్యల లేకుండా చేస్తామన్నారు.ఈకార్యక్రమంలో పాపిరెడ్డి, బాలకృష్ణ, యల్లయ్య, అనిల్, పాల్గొన్నారు.

## గిరిజనుల హక్కుల సాధనకు కృషి చేయాలి

తిరుమలాయపాలెం, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): గిరిజనుల హక్కుల సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని భారతీయ గోర్‌బంజార పోరాట సమితి మండల అధ్యక్షుడు బాదావత్ రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం తిరుమలాయపాలెంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గిరిజనులకు దామాష ప్రకారం రావాల్సిననిధులు గిరిజన ప్రాంతాల్లో ఖర్చు చేయాలన్నారు. ఈకార్యక్రమలో సీతా రాంనాయక్, అన్వేష్, రాంబాబు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా

ఖమ్మంటౌన్, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. ఆదివారం జిల్లా సీపీఎం కార్యాలయం సుందరయ్యభవన్‌లో నిర్వహించిన సీపీఎం పాలేరు డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే మార్చి, ఏప్రిల్‌నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా ఉద్యమించాలని నిర్ణయించామని, దానికి అనుగుణంగా డివిజన్ల వారీగా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. పాలేరు డివిజన్ సీపీఎంకు బలమైన ఉద్యమ నిర్మాణం కలిగిన ప్రాంతమని, ఈ ప్రాంతంలో రైతు, కూలీ పోరాటాలు, విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక పోరాటాలు అనేకం జరిగాయన్నారు. వాటి వారసత్వాన్ని కొనసాగించేందుకు నేటి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ మాట్లాడుతూ ఆనాటి ఉద్యమాలను స్ఫూర్తిగా తీసుకొని, మరింత ఉత్సాహంతో కార్యకర్తలు, నాయకులు పాలేరు నియోజకవర్గంలో సీపీఎంకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. సీపీఎం జిల్లాకమిటీ సభ్యుడు సంద్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఎం జిల్లా నాయకురాలు బుగ్గవీటి సరళ, జిల్లాకమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్, గొడవర్తి నాగేశ్వరరావు, ఊరడి సుదర్శన్ రెడ్డి, కొమ్ము శ్రీను, మల్లెల హనుమంతరావు, మండల కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

## ఈ-పంచాయితీ ఆపరేటర్లను ఆదుకోవాలి



నగదు అందిస్తున్న సహచర ఉద్యోగులు

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఈ పంచాయతీ ఆపరేటర్లకు శ్రమకు తగిన ప్రతిఫలం అందడం లేదని, ఉద్యోగ భద్రత లేదని... ఈపంచాయతీ ఆపరేటర్ల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ప్రవీణ్‌కుమార్ అన్నారు. అకాల మరణం పొందిన వారి కుటుంబాల జీవనం అగమ్య గోచరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఈ పంచాయతీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న బుద్ధ ప్రదీప్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం మృతుని కుటుంబాన్ని అసోసియేషన్ సభ్యులు పరామర్శించారు. ప్రదీప్‌కుమార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు రూ.60వేలు అందజేశారు. ఈకార్యక్రమంలో అధ్యక్షుడు మాలోత్ సందీప్, రాష్ట్ర ట్రెజరర్ దోనపర్తి ప్రణీత్ కుమార్, జిల్లా అధ్యక్షులు చెన్నారావు, జిల్లా డీపీఎం నరేష్, ఎంపీడీవోలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

## పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

» ప్రభుత్వ డ్రైవర్ల సంఘం

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏ, బిల్స్ పీఆర్సీని తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నాయకులు వీజీకె మూర్తి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ఎండి. సలీం కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ డ్రైవర్లకు పెండింగ్ డీఏలు పెండింగ్ బిల్స్ పీఆర్సీ విడుదల చేయాలన్నారు. సంక్రాంతి కానుకగా నైనా అందించాలని వారు కోరారు. అనంతరం పలు డిమాండ్లను, తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో సొసైటీ సలహాదారులు కే కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, దాసరి వేణుగోపాల్ , ఎల్ గంగన్న ,జి రాములు, నాగరాజు, బి రామారావు ఎస్ వి. ప్రసాద్, కే శ్రీనివాస్ రెడ్డి తో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ వనమా శ్రీనివాసరావు, నాగరాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# డీఆర్‌ఎఫ్‌లో సమూల మార్పులు

» కేఎంసీ కమిషనర్ కీలక ఆదేశాలు
» సెలవుపై వెళ్లి.. హాజరు నమోదు చేసిన ఉద్యోగిపై చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



డీఆర్‌ఎఫ్ బృందం

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు, అత్యవసర సమయంలో ప్రజలను కాపాడేందుకు ఖమ్మం నగర పాలక సంస్థ పర్యవేక్షణలో నిర్మాణం చేసిన డీఆర్‌ఎఫ్‌లో(డిజాస్టర్ రెస్పాన్స్ పోర్స్) సమూల మార్పులు జరగనున్నాయి. ఈ బందాలు ఏర్పాటు సమయంలోనే సభ్యుల నియామకంపై అనేక విమర్శలు వెలువడ్డాయి. కనీస విద్యార్హత లేని వారికి అవకాశం కల్పించారని, నిబంధనలకు విరుద్ధంగా 40ఏళ్ల పైబడిన వారిని సైతం నియమించారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి సిఫారసు మేరకు నియామకం చేశారని విమర్శలు వెలువడ్డాయి. డీఆర్‌ఎఫ్ నిర్మాణం జరిగిన తర్వాత కేఎంసీ పరిపాలనలో ఆక్రమణలు తొలగింపు, నుంచి వీధివ్యాపారులను రైతుబజార్లుకు తరలించటం వరకు కొంత మేరా బాధ్యతలు సక్రమంగా నిర్వహించారని మన్ననలు పొందారు. అయితే 20మందితో ఏర్పడిన డీఆర్‌ఎఫ్ బృందం దశల వారీగా లక్ష్యం తప్పిందని విమర్శలు వెలువడ్డాయి. రాజకీయ పలుకుబడి, కార్పొరేటర్ల సిపారసుల కారణంగా అధికారుల మాట వినకుండా కనీస విధులు నిర్వహించకపోవటంతో కొన్ని నెలలుగా పలు విమర్శలకు దారి తీసింది.

**'ఆంధ్రజ్యోతి' కథనంతో చర్యలు**

డీఆర్‌ఎఫ్ బృందం పర్యవేక్షకుడు డిసెంబరు 11నుంచి 13వరకు వ్యక్తిగత సెలవ్‌పై వెళ్లి తర్వాత హాజరు నమోదు విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకొచ్చింది. ఈనెల 28న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'లక్ష్యం తప్పిన డీఆర్‌ఎఫ్' కథనంపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. అధికారులను తప్పుదోవ పట్టించిన డీఆర్‌ఎఫ్ బృందం టీంలీడర్‌పై చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఎఫ్‌కు వేతనాలు అందించే మహాత్మా గాంధీ టౌన్ లెవల్ అధ్యక్షురాలు జ్యోతికి కమిషనర్ ఆదేశాలిచ్చారు.

**మరింత దృఢంగా డీఆర్‌ఎఫ్**

20 మందితో ఏర్పడిన డీఆర్‌ఎఫ్ బృందంలో ఇప్పుడు 16మంది వరకు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వరదలు, అగ్ని, ఇతర అత్యవసర సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా డీఆర్‌ఎఫ్ బృందాలకు ప్రత్యేకంగా వృత్తి నైపుణ్య శిక్షణను ఇవ్వనున్నారు. ఈ మేరకు కేఎంసీ ఉద్యాన అధికారి(ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్) రాధికకు కమిషనర్ అభిషేక్ అగస్త్య బాధ్యతలు అప్పగించారు. సిబ్బంది సామర్థ్యాలపై ప్రత్యేకంగా నివేదికలను రూపొందిస్తున్నారు.సిబ్బందికి ఈత, అగ్నిప్రమాదాలను ఎదుర్కొవటం, గుట్టలు ఎక్కటం వంటి అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ చేస్తున్నారు.

# అధిక వడ్డీలకు ఆశపడి మోసపోవద్దు

» తెలియని వ్యక్తులు, సంస్థల వద్ద బంగారం తాకట్టు పెట్టకండి
» అనుమతి లేని చిట్టీలు నడిపేవారిపై కఠిన చర్యలు
» నేలకొండపల్లి ఎస్‌ఐ సంతోష్




నేలకొండపల్లి,డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీలకు ఆశపడి అప్పులుగా ఇచ్చి మోసపోవద్దని నేలకొండపల్లి ఎస్‌ఐ పెంటరి సంతోష్ హెచ్చరించారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన నమ్మించి నట్టేటముంచాడు కథనంపై పోలీసులు దృష్టి సారించారు. ముగ్గురిపై కేసును నమోదు చేశారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ అధిక వడ్డీలకు ఆశపడి ప్రజలు మోసపోతున్న ఉదంతాలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయన్నారు. అయినప్పటికీ ప్రజల్లో మార్పు రావటం లేదన్నారు. అధిక వడ్డీలకు ఆశపడి నేలకొండపల్లి మండలంతో పాటుగా ఇతర ప్రాంతాలకు చెందిన వారు సైతం ఓవ్యక్తికి పెద్ద మొత్తాల్లో డబ్బులివ్వటం, అతను కనపడకుండా పోవటంతో జనం నష్టపోయారన్నారు. సదరు వ్యక్తికి అప్పులిచ్చిన వారు ఫిర్యాదు చేయటానికి ముందుకు రావటం లేదని, ఎవరైనా సరే నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయాలని వారికి న్యాయం చేయటానికి ప్రయత్నం చేస్తామన్నారు. బంగారం తాకట్టు పెట్టుకుని డబ్బులిస్తామని, ప్రచారం చేసుకుంటున్నాయని, వారికి/సంస్థలకు అనుమతులున్నదీ, లేనిదీ చూసుకోవాలని, అటువంటి వాటిలో కూడా ఎవ్వరూ బంగారంలాంటి విలువైన వస్తువులు తాకట్టు పెట్టద్దన్నారు. అనుమతులు లేకుండా చిట్టీలు నడపటం, వారాలకు డబ్బులివ్వటం లాంటివి ఎక్కడైనా ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తేవాలన్నారు. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా చిట్టీలు నడిపే వారిని ఉపేక్షించబోమన్నారు.

## ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులదే

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి):ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికార యంత్రాంగంపై ఉందని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్ ప్రశ్నించారు. ఆదివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. ఖమ్మం నగరంలో విస్తరించిన ఉన్న గ్యాస్ గోదాంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి ఝాన్సీ, కే శ్రీనివాస్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, జక్కుల భరత్, సత్తార్‌మియా, వీ వెంకటేష్ పాల్గొన్నారు.

## పూర్వవిద్యార్థుల సమ్మేళనం



తిరుమలాయపాలెం, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరేణి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1984-85 పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సుమారు 40 ఏళ్ల అనంతరం వీరు కలిశారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.అలాగే ఆటపాట కార్యక్రమం నిర్వహించారు. పాఠాలు బోధించి, తమకు ఉన్నతస్థాయిలో చేరుకోవడానికి కృషి చేసిన ఆనాటి గురువులను సన్మానించారు. ఈకార్యక్రమంలో మచ్చా మధు, బెల్లం వేణుగోపాల్, ఎస్.కరుణ, సీహెచ్ కృష్ణకుమారి, పూర్ణ చందర్‌రావు, కె.రామయ్య, వి.భాస్కర్, సీత, జానిమియా పాల్గొన్నారు.

# శిథిలావస్థలో కల్వర్టులు

» భారీ వాహనాల రద్దీతో కూలుతున్న వంతెనలు
» హైలెవల్ వంతెనలు నిర్మించాలని ప్రజల వినతి



చింతకాని రహదారిలో కుంగిన వంతెన

చింతకాని, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో వంతెనలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. అధికారులు వీటిని పట్టించుకోకపోవడంతో ముప్పుగా మారి ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి. వీటిపై ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఏటా వర్షాకాలంలో వచ్చే కొద్దిపాటి వర్షాలకే కల్వర్టులు, లో లెవల్ బ్రిడ్జిలపై నుంచి వరద ప్రవహిస్తుంది.



నాగులవంచ- పాతర్లపాడు బండిరేవు వద్ద వరదకు రాకపోకల నిలిపివేత (ఫైల్)

కుండపోతగా వర్షాలు వచ్చిన సమయంలో రెండు, మూడు రోజుల వరకు ప్రయాణాలు నిలిపివేయాల్సిన పరిస్థితి. నిర్వహణ లోపానికి తోడు, రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రాకపోకలు నిలిపివేయాల్సిందే...**

మండల పరిధిలోని నాగులవంచ- పాతర్లపాడు గ్రామాల మధ్య ఉన్న బండిరేవు, నేరడ- చింతకాని గ్రామాల మధ్య ఉన్న దాసరి బంధం, రేపల్లెవాడ- చింతకాని మధ్య ఉన్న జెర్రిపోతుల బంధం, నేరడ- లచ్చగూడెం గ్రామాల మధ్య ఉన్న కొత్తబంధం, లచ్చగూడెం- రామకృష్ణాపురం గ్రామాల మధ్య ఊర చెరువు బంధం, నాగిలిగొండ- రెడ్డిగూడెం గ్రామాల మధ్య మునగాల వాగు, బోనకల్- ఖమ్మం మెయిన్‌రోడ్డుపై రామకృష్ణాపురం అడ్డరోడ్డు సమీపంలోని వాగు ఇలా మండల వ్యాప్తంగా ఉన్న 7 వాగులపై ఏళ్ల క్రితం నిర్మించిన లో లెవల్ బ్రిడ్జిలు, కల్వర్టుల పై కొద్దిపాటి వర్షాలకే వరద ప్రవహించడంతో వాహన రాకపోకలు నిలిపివేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ పరిస్థితి ఏళ్లుగా కొనసాగుతోంది. రెండేళ్ల క్రితం నాగులవంచ-పాతర్లపాడు గ్రామాల మధ్య ఉన్న బండిరేవుపై వరద ప్రవహించడంతో ఓ కారు వరద తాకిడికి కొట్టుకుని పోయింది. గ్రామస్థులు సకాలంలో స్పందించడంతో కారులో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీశారు.

మండలంలో రెండు జాతీయ రహదారులు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణ పనులకు సంబంధించి సదరు నిర్మాణ సంస్థ భారీ టిప్పర్లతో మట్టి తోలకాలు చేపడుతున్నది. అప్పటి ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించిన వీటిపై సామర్థ్యానికి మించిన బరువు ఉన్న వాహనాలు వెళుతుండగా కాలక్రమంగా మరమ్మతులకు గురవుతున్నాయి. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కల్వర్టులు శిథిలావస్థకు చేరి అకస్మాత్తుగా కూలిపోతున్నాయి. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కాలం వెల్లదీస్తున్నారు. రెండు రోజుల క్రితం నేరడ- చింతకాని రహదారిపై నేరడ సమీపంలోని వాగుపై ఉన్న వంతెన కూలిపోయింది. ఆ సమయంలో వాహనాలు ఏమి లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మండల నాయకులు స్పందించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

**హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించాలి**

● తేలుకుంట్ల శ్రీను, పాతర్లపాడు



వాగులపై లోలెవల్ బ్రిడ్జిల నిర్మించడం వలన భారీ వర్షాలు వచ్చినపుడు బ్రిడ్జిల పై నుంచి వరద ప్రవాహం ఉండడంతో అధికారులు రాకపోకలు నిలిపివేస్తున్నారు. ఇటువంటి సమయాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆసుపత్రులకు తరలించాలంటే ఇబ్బందిగా ఉంది. శిథిలావస్థకు చేరిన కల్వర్టులు, బ్రిడ్జిల స్థానంలో హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలి.

## కంటి వైద్య శిబిరం విజయవంతం



రోగిని పరీక్షిస్తున్న కంటి వైద్య నిపుణుడు రవిచంద్ర

నేలకొండపల్లి, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో లయన్ కంటిఆసుపత్రి, వైరా వారి సహకారంతో ఆదివారం నేలకొండపల్లి, గౌతమి కాన్సెప్ట్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం పూర్తిగా విజయవంతమైంది. మొత్తం 220 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో 60మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. అందులో 20మందికి సోమవారం వైరాలోని లయన్ కంటి వైద్యశాలలో ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు క్యాంప్ చైర్మన్ గెల్లా జగన్మోహన్‌రావు, వైస్‌చైర్మన్ వెల్లంపల్లి శ్రీనివాస్ చెప్పారు. మిగిలిన రోగులకు జనవరి నెలాఖరు కల్లా ఆపరేషన్లు పూర్తి చేస్తామన్నారు. వైద్యులు జి.రవిచంద్ర, వరలక్ష్మి, శ్యాంబాబు రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పొన్నగాని శ్రీనివాస్, కార్యదర్శి తెలగొర్ల లింగస్వామి, కోశాధికారి దండా రవీందర్, మాజీ అధ్యక్షుడు నెల్లూరి వీరబాబు, ఏటుకూరి ప్రకాశరావు, వాసం లక్ష్మయ్య, నంచర్ల దేవీప్రసాద్, యలమద్ది లెనిన్, గెల్లా వెంకటరమణగుప్తా, గరిణె వెంకటేశ్వర్లు, కనపర్తి కోటేశ్వరరావు, చావా గణపతిరావు, భవనాశి దుర్గారావు, యర్రా సైదయ్య, షేక్. ఖాసీం, రేల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## యాదవులకు ప్రాధాన్యత కల్పించాలి

**అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల**

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని యాదవులకు రాష్ట్ర జిల్లాస్థాయిలో నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కలిపించాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్, జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనరసయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సంఘం రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవుల్లో యాదవులకు సముచిత స్థానం కలిపించాలని, మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను వెంటనే అమలు చేయాలని తెలిపారు. ఈసమావేశంలో జిల్లాయాదవ యువజన అధ్యక్షుడు చిత్తారి సింహాద్రియాదవ్, రాష్ట్రకార్యదర్శి లొడిగ వెంకన్నయాదవ్, దుబాకుల శ్రీనివాస్, దుబాకుల వెంకటేశ్వర్లు, దూదే భద్రయ్య, చేతుల నాగేశ్వరరావు, బొల్లి కొమరయ్య,మొర్రిమేకల కోటయ్య పాల్గొన్నారు.

## వైరా సీపీఎం డివిజన్ కమిటీ ఎన్నిక

వైరా, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శివర్గం ఎన్నికైంది. ఆదివారం వైరాలో తాళ్లపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగిన డివిజన్ కమిటీ సమావేశంలో తొమ్మిదిమందితో కార్యదర్శివర్గం ఎన్నికైందని డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం తెలిపారు. కార్యదర్శివర్గంలో భూక్యా వీరభద్రం, సుంకర సుధాకర్, తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, చింతనిప్పు చలపతిరావు, దొంతెబోయిన నాగేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు, మచ్చా మణి ఎన్నికయ్యారని వివరించారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

పెనుబల్లి, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో రాజేంద్రగౌడ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. పెనుబల్లి, వీఎంబంజర్, లంకపల్లి, చింతగూడెం గ్రామాల్లో సర్వే ఆలస్యమవుతుందని ఆయా గ్రామాల్లో ఈనెల 31లోపు సర్వేను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లో 85శాతం సర్వే పూర్తయిందని అధికారులు ఈ నాలుగు గ్రామాల్లో సర్వే పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంటా ప్రతాప్, ఏపీవో విజయ్‌బాబు, వెలుగు సీసీ పాల్గొన్నారు.

# శిథిలావస్థలో కల్వర్టులు

- భారీ వాహనాల రద్దీతో కూలుతున్న వంతెనలు
- హైలెవల్ వంతెనలు నిర్మించాలని ప్రజల వినతి


చింతకాని రహదారిలో కుంగిన వంతెన

చింతకాని, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో వంతెనలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. అధికారులు వీటిని పట్టించుకోకపోవడంతో ముప్పుగా మారి ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి. వీటిపై ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఏటా వర్షాకాలంలో వచ్చే కొద్దిపాటి వర్షాలకే కల్వర్టులు, లో లెవల్ బ్రిడ్జిలపై నుంచి వరద ప్రవహిస్తుంది. కుండపోతగా వర్షాలు వచ్చిన సమయంలో రెండు, మూడు రోజుల వరకు ప్రయాణాలు నిలిపివేయాల్సిన పరిస్థితి. నిర్వహణ లోపానికి తోడు, రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నాగులవంచ- పాతర్లపాడు బండిరేవు వద్ద వరదకు రాకపోకల నిలిపివేత (ఫైల్)

## రాకపోకలు నిలిపివేయాల్సిందే...

మండల పరిధిలోని నాగులవంచ- పాతర్లపాడు గ్రామాల మధ్య ఉన్న బండిరేవు, నేరడ- చింతకాని గ్రామాల మధ్య ఉన్న దాసరి బంధం, రేపల్లెవాడ- చింతకాని మధ్య ఉన్న జెర్రిపోతుల బంధం, నేరడ- లచ్చగూడెం గ్రామాల మధ్య ఉన్న కొత్తబంధం, లచ్చగూడెం- రామకృష్ణాపురం గ్రామాల మధ్య ఊర చెరువు బంధం, నాగిలిగొండ- రెడ్డిగూడెం గ్రామాల మధ్య మునగాల వాగు, బోనకల్- ఖమ్మం మెయిన్‌రోడ్డుపై రామకృష్ణాపురం అడ్డరోడ్డు సమీపంలోని వాగు ఇలా మండల వ్యాప్తంగా ఉన్న 7 వాగులపై ఏళ్ల క్రితం నిర్మించిన లో లెవల్ బ్రిడ్జిలు, కల్వర్టుల పై కొద్దిపాటి వర్షాలకే వరద ప్రవహించడంతో వాహన రాకపోకలు నిలిపివేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ పరిస్థితి ఏళ్లుగా కొనసాగుతోంది. రెండేళ్ల క్రితం నాగులవంచ-పాతర్లపాడు గ్రామాల మధ్య ఉన్న బండిరేవుపై వరద ప్రవహించడంతో ఓ కారు వరద తాకిడికి కొట్టుకుని పోయింది. గ్రామస్థులు సకాలంలో స్పందించడంతో కారులో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీశారు.

మండలంలో రెండు జాతీయ రహదారులు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణ పనులకు సంబంధించి సదరు నిర్మాణ సంస్థ భారీ టిప్పర్లతో మట్టి తోలకాలు చేపడుతున్నది. అప్పటి ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించిన వీటిపై సామర్థ్యానికి మించిన బరువు ఉన్న వాహనాలు వెళుతుండగా కాలక్రమంగా మరమ్మతులకు గురవుతున్నాయి. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కల్వర్టులు శిథిలావస్థకు చేరి అకస్మాత్తుగా కూలిపోతున్నాయి. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కాలం వెళ్లదీస్తున్నారు. రెండు రోజుల క్రితం నేరడ- చింతకాని రహదారిపై నేరడ గ్రామ సమీపంలోని వాగుపై ఉన్న వంతెన అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ సమయంలో వాహనాలు ఏమి లేక పోవడంతో ప్రమాదం తప్పింది. స్థానిక మండల నాయకులు స్పందించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి సమస్యలను తీసుకెళ్లి, పాత వంతెనల స్థానంలో హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

### హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించాలి

● తేలుకుంట్ల శ్రీను, పాతర్లపాడు



వాగులపై లోలెవల్ బ్రిడ్జిల నిర్మించడం వలన భారీ వర్షాలు వచ్చినపుడు బ్రిడ్జిల పై నుంచి వరద ప్రవాహం ఉండడంతో అధికారులు రాకపోకలు నిలిపివేస్తున్నారు. ఇటువంటి సమయాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆసుపత్రులకు తరలించాలంటే ఇబ్బందిగా ఉంది. శిథిలావస్థకు చేరిన కల్వర్టులు, బ్రిడ్జిల స్థానంలో హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలి.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

పెనుబల్లి, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో రాజేంద్రగౌడ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. పెనుబల్లి, వీఎంబంజర్, లంకపల్లి, చింతగూడెం గ్రామాల్లో సర్వే ఆలస్యమవుతుందని ఆయా గ్రామాల్లో ఈనెల 31లోపు సర్వేను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లో 85శాతం సర్వే పూర్తయిందని అధికారులు ఈ నాలుగు గ్రామాల్లో సర్వే పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంటా ప్రతాప్, ఈజీఎస్ ఏపీవో విజయ్‌బాబు, వెలుగు సీసీ ఎం.ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, అంగన్‌వాడీ టీచర్ కృష్ణకుమారి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# 'మున్నూరు కాపులంతా కలిసికట్టుగా ఉండాలి'


సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారావు

కారేపల్లి, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మున్నూరు కాపులంతా కలిసికట్టుగా ఉంటూ, తమకు కావాల్సిన హక్కులను రాబట్టుకోవాలని మండల మున్నూరు కాపుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు గమిడి నర్సింహారావు, ముత్యాల సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ తమకు సంబంధించిన అనేక విషయాలను సాధించుకునేందుకు అందరు ఐక్యంగా కలిసి పనిచేయాలన్నారు. త్వరలో పూర్తిస్థాయి మండల కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు పగడాల మంజుల, కోశాధికారి వాకాటి సురేష్, పొట్లకాయల రమేష్, కప్పెర రంగరావు, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ల ధ్వంసం కోసమే కేంద్రం కుట్రలు

- తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్లను ధ్వంసం చేసేందుకు కేంద్రప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తూ ఏపీఎంసీ చట్టానికి 12సవరణలు చేస్తూ నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ప్రకటించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాం బాబు విమర్శించారు. చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన ఆదివారం వైరాలో నూతన వ్యవసాయ మార్కెట్ విధానంపై జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వ్యవసాయ మార్కెట్లలో రైతులకు సరైన ఆదాయం రావడం లేదనే సాకుతో కార్పొరేట్ సంస్థలకు వ్యవసాయ మార్కెట్లను కట్టబెట్టేందుకు కేంద్రప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని ఆక్షేపించారు. కేంద్రం ఈ విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ బొంతు సమత, నాయకులు పారుపల్లి కృష్ణారావు, శ్రీనాథ్, కురుగుంట్ల శ్రీనివాసరావు, నారికొండ అమరేంద్ర, రుద్రాక్షల నర్సింహాచారి, మల్లెంపాటి ప్రసాద్, అమరనేని కృష్ణ, ఎస్‌డీ. పాషా, వడ్లమూడి మధు, చలపతిరావు పాల్గొన్నారు.

# 'ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి'

వైరా, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌ను పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శించడం అంటే రాజ్యాంగంలో మహిళా హక్కులను అవమానించడమేనని ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ వ్యాఖ్యానించారు. మాజీ ఎంపీపీ బొంతు సమత అధ్యక్షతన బోడేపూడి భవన్‌లో ఆదివారం జరిగిన ఐద్వా సమావేశంలో ఆమె మాట్లాడారు. వెంటనే దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మేరుగు రమణ, నాయకురాళ్లు తోట కృష్ణవేణి, గుడిమెట్ల రజిత, బత్తుల ప్రమీ ల, తాటి కృష్ణకుమారి, మాడపాటి సుజాత, భూక్యా విజయ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బండి పద్మ

# పాస్టర్లకు దుస్తులు వితరణ


చర్చిపాస్టర్లకు దుస్తులు అందిస్తున్న పూర్ణచంద్రారెడ్డి

ఎర్రుపాలెం, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల శుభమస్తు కల్యాణ మండపంలో కాంగ్రెస్ నాయకుడు యరమల పూర్ణచంద్రారెడ్డి మండలంలో గల చర్చిపాస్టర్లకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోగల 130మంది పాస్టర్లకు నూతన వస్త్రాలను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. ఈసందర్భంగా పూర్ణచంద్రారెడ్డిని పలువరు కాంగ్రెస్ నాయకులు అభినందించారు. అనంతరం పాస్టర్లు పూర్ణచంద్రారెడ్డిని శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు కృష్ణారావు, దేవరకొండ రాజీవ్‌గాంధీ, మొగిలి అప్పారావు, కడియం శ్రీనివారావు, మల్లెల లక్ష్మణరావు, కంచర్ల వెంకటనరసయ్య, శీలం వెంకటరామిరెడ్డి, దేవరకొండ శ్రీను, గుడేటి బాబురావు, పాస్టర్లు పాల్గొన్నారు.

# దుమ్ములేస్తుంది..

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- రోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతి


లారీ వెళ్తుండటంతో లేచిన దుమ్ము

ముదిగొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ నుంచి న్యూలక్ష్మీపురం వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా ఉండటంతో ఇటీవల నూతనంగా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. రోడ్డుపై కంకపరిచి నెలలు గడుస్తున్నా బీటీ వేయకపోవడంతో వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము, ధూళి లేచి ఇళ్లలోకి చేరుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇదే విషయమై ఇటీవల సీపీఎం ఆధ్వర్యంలో పలువురు గ్రామస్థులు ఆందోళన చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చేరికలు

- అన్నిస్థానాల్లో కాంగ్రెస్ గెలవాలి
- కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన భట్టి


కాంగ్రెస్‌లో చేరిన వారితో భట్టి(ఫైల్)

మధిరటౌన్, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్ధేశం చేశారు. ఇటీవల మధిరలో మధిర, ఎర్రుపాలెం, ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాల కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో భట్టి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులను పార్టీ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. పలువురు నాయకులు గ్రామాల్లో తమకు తెలియకుండా చేరికలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. పార్టీలోకి ఎవరు వచ్చిన చేర్చుకొని పార్టీని బలోపేతం చేయాలని చెప్పానని, కానీ మీరు చేర్చుకోక పోవడం వల్లనే ఇతరులు చేర్పిస్తున్నారని సమాధానం చెప్పారు.

## గెలిచిన వాళ్లు నా పక్కన కూర్చుంటారు..

పార్టీ బలోపేతం అయితే రాబోయే స్థానిక ఎన్నికల్లో మీరు ప్రజాప్రతినిదులుగా ఉంటారు, గెలిచిన వాళ్ల రాబోయే నాలుగేళ్ల మీ గ్రామాల్లో ఏ అధికార కార్యక్రమం జరిగినా నా పక్కన కూర్చుంటారు, ఓడిన వారు ఎదురుగా ప్రజల మధ్య కూర్చుంటారు అని చురుకలు అంటించారు. గత స్థానిక ఎన్నికల్లో ఎవరు పార్టీకి పని చేసింది, పార్టీ అభ్యర్థులకు ఎవరు వెన్నుపోటు పొడిచింది, పార్టీ తరుపున గెలిచి పార్టీని విడిన వారు ఎవరు అందరి జాతకాలు నాకు తెలుసని గాటుగా సమాధానం ఇచ్చారు. పట్టణ నాయకుడికి పార్టీ గెలుపు ఓటములతో సంబంధం లేదని, ఆయన వ్యాపారాలు ఆయనకు ఉంటాయని, ఆయనకు పదవులు కావాలని పార్టీ కాదని అటువంటి వారు పార్టీకి అవసరం లేదని అన్నారు. రామచంద్రాపురం గ్రామానికి రూ.3కోట్లతో లిఫ్ట్ మంజూరు చేసి పూర్తి చేశానని, కానీ ఆ గ్రామ పంచాయతీ క్రితం సారి బీఆర్ఎస్ పార్టీకి ఏకగ్రీవం ఎలా అయ్యిందని, పార్టీ తరుపున పోటీ చేసేందుకు అభ్యర్థి దొరకలేదా అని ప్రశ్నించారు. గతంలో ఏమి జరిగింది అనే దానికంటే, ప్రస్తుతం ఏమి చేయాలనే దాని గురించి ఆలోచించాలని సూచించారు. తొందరలోనే స్థానిక ఎన్నికలు రానున్నాయని పాత వారితో పాటు కొత్తగా పార్టీలో చేరిన వారికి కూడా పోటీకి అవకాశం ఇస్తానని వెంటనే పని ప్రారంభించాలని దిశా నిర్ధేశం చేసి పరోక్షంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.

## పార్టీ బలోపేతం దిశగా అడుగులు...

భట్టి నిర్దేశంతో ఇతర పార్టీల నుంచి చేరికల జోరును పెంచేందుకు కాంగ్రెస్ నాయకులు ఎవరికి వారే పోటా పోటీగా చేరికలకు తెరలేపుతున్నారు. అవసరం అయితే కొందరు నాయకులతో భట్టితో మాట్లాడిస్తున్నారు. ఎర్రుపాలెం మండలం నుంచి ఇప్పటికే మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీపీలతో పాటు ఓ పార్టీ మండల అధ్యక్షుడు త్వరలో పార్టీలో చేరనున్నారని తెలిసింది. మధిర మండలంలో పలువురు కౌన్సిలర్లతో పాటు మాజీ ప్రజాప్రతినిదులను, బోనకల్ మండలంలో మరికొందరు కీలక నాయకులతో పాటు చింతకాని మండలంలో మరికొందరు గ్రామస్థాయి నాయకులతో పాటు ముదిగొండ మండలంలో మరికొందరు కీలక నాయకులతో కాంగ్రెస్ నాయకులు చర్చలు ప్రారంభించారు.

# ప్రదీప్ కుటుంబానికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

చింతకాని, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): చింతకాని మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఈ- కంప్యూటర్ ఆపరేటర్ బుద్దా ప్రదీప్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన ప్రదీప్ సంస్మరణ సభలో పలు ఉద్యోగ సంఘాలు నాయకులు పాల్గొని, మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఈ- కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రూ.42 వేల ఆర్థిక సహాయం, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆపరేటర్ల తరపున సంఘం అధ్యక్షుడు సందీప్ నాయక్ రూ.50 వేలు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీఈ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ అసోసియేషన్ బాధ్యులు మల్లెల రవీంద్రప్రసాద్, ఎంపీడీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తెల్లూరి శ్రీనివాసరావు, చింతకాని ఎంపీడీవో రామయ్య, ఎంపీవో పర్వీన్ కైసర్, పంచాయతీ కార్యదర్శుల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, తిలక్, ఆపరేటర్లు సుమంత్, రాజు, ప్రశాంత్, టీఎన్జీవో నాయకులు, చింతకాని మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వైరా సీపీఎం డివిజన్ కమిటీ ఎన్నిక

వైరా, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శివర్గం ఎన్నికైంది. ఆదివారం వైరాలో తాళ్లపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగిన డివిజన్ కమిటీ సమావేశంలో తొమ్మిదిమందితో కార్యదర్శివర్గం ఎన్నికైందని డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం తెలిపారు. కార్యదర్శివర్గంలో భూక్యా వీరభద్రం, సుంకర సుధాకర్, తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, చింతనిప్పు చలపతిరావు, దొంతెబోయిన నాగేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు, మచ్చా మణి ఎన్నికయ్యారని వివరించారు.

# ప్రజాసమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

తల్లాడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి సోమవారం తల్లాడ రెవెన్యూ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఏ.వనజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్‌డే కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10.30నుంచి మధ్యాహ్నాం 2గంటల వరకు తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతుందని వివరించారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో మండల స్థాయి అన్నిశాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినిమోగం చేసుకోవాలని కోరారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వైరా, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా వైరా మండలం సిరిపురం గ్రామంలో 1998-99 పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటపాటలతో సందండి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పుడు పనిచేసిన ఉపాధ్యాయులను, కార్యక్రమానికి సహకరించిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు

వైరా, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తలసీమియా బాధిత పిల్లల సహాయం కోసం ఆదివారం వైరా మునిసిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాల యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. ఆసంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత, మోహన్‌రావు, ఆదూరి ప్రేమ్‌కుమార్, రవికుమార్, తిరుపతయ్య, మాదినేని నాగరాణి, రోహణ్, రఘు, రాకేష్ పాల్గొన్నారు.

# పుడమి సాహితి ఆరో వార్షికోత్సవం


పలురంగాల్లో కృషిచేసిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

ముదిగొండ, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): పుడమి సాహితీ ఆరో వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ముదిగొండలోని ఓ పంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రామన్ అచ్యుతరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పద్మశ్రీ వనజీవి రామయ్య దంపతులు, పుడమి సాహితి జాతీయ అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి పాల్గొన్నారు. వివిధ రంగాల్లో కృషిచేసిన 60మందికి పుడమిరత్న జాతీయ విశిష్ట సేవ పురస్కారాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో పద్మశ్రీ వనజీవి రామయ్య, జాతీయ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కంచర్ల శ్రీనివాస్, రామన్ అచ్యుతరావు, చలమాల హైమావతి, జానీ పాల్గొన్నారు.

## గురుకుల ఉపాధ్యాయుడికి పుడమిరత్న అవార్డు


బుచ్చయ్యకు పుడమిరత్న జాతీయ పురస్కారం అందజేస్తున్న దృశ్యం

మధిర రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం కృష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కవి, రచయిత అయిన రావిరాల బుచ్చయ్యకు పుడమి రత్న జాతీయ విశిష్ట పురస్కార అవార్డు లభించింది. పుడమి సాహితీ వేదిక ఖమ్మం, మానవ హక్కుల ప్రజారక్షణ సమితి ఆరో వార్షికోత్సవం సందర్భంగా పుడమి రత్న జాతీయ పురస్కారాన్ని ఆదివారం అందించారు. ఈ సందర్భంగా పుడమి సాహితీ వేదిక అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మానవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షురాలు హైమావతి చేతులమీదుగా ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో బుచ్చయ్యకు ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో పద్మశ్రీ వనజీవి రామయ్య పాల్గొన్నారు.

# నేడు నల్లగొండలో సీపీఐ బహిరంగ సభ

ఖమ్మంటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా నల్లగొండలోని ఎన్‌జీ కాలేజీలో సోమవారం నిర్వహించే బహిరంగసభకు అత్యధికంగా హాజరై జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం జిల్లా సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభకు హాజరయ్యే పురుషులు ఎర్రచొక్కాను, మహిళలు ఎర్రచీరెను తప్పనిసరిగా ధరించాలన్నారు. సమయపాలన పాటించి, క్రమశిక్షణతో సభకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నగర కార్యదర్శి ఎస్‌కే. జానీమియా, జిల్లా కార్యవర్గసభ్యులు బీజీ.క్లైమెంట్, కొండపర్తి గోవిందరావు, సింగు నర్సింహారావు, పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు.

# వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి నగదు వితరణ


నగదు అందజేస్తున్న నాగేశ్వరరావు

కారేపల్లి, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి ఖమ్మం పట్టణానికి చెందిన నూతలపాటి నాగేశ్వరరావు రూ.ఐదువేలను కమిటీ సభ్యులకు వితరణగా అందజేశారు. ఆదివారం ఆలయంలో ఆలయపూజారి తిరుమలచార్యుల సమక్షంలో అందజేశారు. ఈకార్యక్రమంలో తుమ్మోజి రాంమూర్తి, వేమూలూరి కోటచారి, రామాచారి, గుండోజు కృష్ణయ్యచారి తదితరులు పాల్గొన్నారు.